
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఏలూరు

జిల్లా వార్తలు

5

శనివారం 30 మార్చి 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 39.0
కనిష్ఠం : 24.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:25 (శని)
సహరి : 4:38 (ఆది)



మొండికోడుకు వెళ్లు రోడ్డులో ఎండిన కొల్లేరు

రెగ్యులేటర్లకు రెడ్ లైట్

కొల్లేరు పరిరక్షణ మరిచిన సర్కార్ • నెరవేరని సీఎం జగన్ హామీలు • పర్యాటక అభివృద్ధి ఉత్తి మాటలే • పల్లెల్లో మంచినీరు కరువు

మరోవైపు వైసీపీ అనుకూలురు కొల్లేరుపై పంజా • ఎడాపెడా అక్రమ చెరువుల తవ్వకాలు • ఎన్నికల వేళ మరోసారి సర్కస్ ఫీట్లు

'ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ సరస్సు వైపు ఉప్పునీరు వెళ్లనీయం. రైతులకు, పరీవాహక ప్రజలకు ఇబ్బందులు రానివ్వం. నూరు శాతం స్వచ్ఛనీరుతో కళకళ లాడేలా చూస్తాం. ఎంత ఖర్చయినా పర్వాలేదు, రెగ్యులేటర్లు నిర్మించి తీరతాం. మీ కలలను సాఫల్యం చేస్తాం' గత ఎన్నికలకు రెండేళ్ల ముందు గణపవరంలో సీఎం జగన్ చేసిన ప్రకటన ఇది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు, కృష్ణా జిల్లాలో ఒక రెగ్యులేటర్ నిర్మాణానికి టెండర్లు పిలిచారు. కాని, ఒక్కరు ముందుకు రాలేదు.ఎక్కడా రెగ్యులేటర్ల ఛాయలే కనిపించ లేదు. ఇదంతా కొల్లేరుకు సంబంధించిన వ్యవహారం.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

కొల్లేరులో ఉప్పు నీరు చొరబడకుండా మూడు రెగ్యులేటర్ల నిర్మాణం చేపడుతున్నట్టు 2022, మేలో గణపవరం మండలానికి వచ్చిన సీఎం జగన్ హామీల వర్షం కురిపించారు. ఆకివీడు మండలం దుంపగడప, మొగల్తూరు మండలం మోళ్ళపర్రు, కృష్ణా జిల్లా పడితడిక వద్ద మూడు రెగ్యులేటర్‌లను రూ.470 కోట్లతో నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ హామీ ఇచ్చి రెండేళ్ల దాటింది. టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు మొహం చాటేశారు. కాంట్రాక్ట్ తీసుకున్న ప్రతి పనికి లోకల్ నేతలకు కమిషన్ చెల్లించాల్సిందే. ఆ భారం మోయలేక ముందుగానే కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. ఫలితంగా టెండర్లు నిలిచిపోయాయి. కాని కొల్లేరుకు, పరీవాహక ప్రాంత ప్రజలకు వైసీపీ ఏదో చేస్తున్నట్లుగా ఈ రెండేళ్ల తెగ బిల్డప్ ఇస్తూ వచ్చారు. జిరాయితీ భూముల వ్యవహారంలోనూ లేనిపోని ఆశలు పెట్టారు. అక్రమ చెరువుల తవ్వకాన్ని ప్రోత్సహిస్తున్నప్పుడు ఎవరైనా ఎదురు తిరిగితే ఇదంతా మీకోసమేనంటూ సర్దిచెప్పేశారు. కొల్లేరు మాటున అక్రమాలు చేస్తూ పైపైకి కొల్లేరు పరీవాహకంలో ఉన్న ఓట్లను తమవైపు తిప్పుకోవడానికి చేయని ప్రయత్నాలు ఏమీ లేవు. ఎన్నికలు దగ్గరపడే కొలది చేయని జిమ్మిక్కులు లేవు. పైపైకి ఆమె కొల్లేరు పరిరక్షకులమంటూనే లోలోపల చేయాల్సిందంతా చేసేశారు. కొల్లేరు లంకల్లో లంక గ్రామాలు కొన్నింటిలో అనేకసార్లు వివిధ వర్గాల మధ్య చిచ్చు లేచింది. ఆఖరికి వెలికి దారితీసింది. కుల కట్టుబాటు పేరిట రకరకాల విన్యాసాలు, ఇంత జరుగుతున్నా అధికార వైసీపీ అబ్బా అదేమి లేదు అన్నట్లుగానే సీన్ క్రియేట్ చేస్తూ వచ్చింది. సుమారు కొల్లేరు పరీవాహకంలో 120 గ్రామాలు ఉన్నాయి. వీటిలో వేలాదిమంది ప్రజలు నివసిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో వీరి ఓట్లకు గాలం వేసేందుకు రకరకాల ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. రెగ్యులేటర్లు కట్టలేదు ఎందుకు? పర్యాటకంగా చేస్తామన్నారుగా ఎందుకు చేయలేదు? పల్లెల్లో స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్న మాట ఏమైంది? ఇలాంటి ప్రశ్నలతో కొల్లేరు వాసులు సిద్ధమవుతున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో సీన్ రివర్స్

టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రెగ్యులేటర్ నిర్మాణానికి ప్రతిపాదన ఉంది. కొల్లేరులో ఐదు టీఎంసీల నీరు నిల్వ చేసే క్రమంలో పోలవరం కుడి కాల్వ నుంచి గోదావరి జలాలను కొల్లేరుకు మళ్లించాలని చంద్రబాబు సీఎంగా వున్న సమయంలో అధికారులు ఆయనకు నివేదించారు. కొల్లేరు సరస్సులో నీటి నిల్వ సామర్థ్యం సంతృప్తికర స్థాయిలో ఉంటే దీని ప్రభావంతో కొల్లేరు పరీవాహక ప్రాంతమంతా భూగర్భ జలాలు పెరుగుతాయని ఉప్పు నీరు తగ్గి మంచినీరు క్రమేపి పెరుగు తుందని, దీంతో సాగు, తాగు అవసరాలు దాదాపు తీరుతాయని అధికారులు అప్పట్లో ఈ ప్రతిపాదన చేశారు. సముద్రం నుంచి ఉప్పుటేరు మీదుగా ఉప్పునీరు కొల్లేరులోకి ఎగబాకకుండా చేయడమే అప్పటి అధికారులు చేసిన ప్రధాన సూచన. ఆకివీడు వద్ద రెగ్యులేటర్ నిర్మాణం జరిగితే ముందస్తుగా కొంత మేర కొల్లేరును కాపాడుకోవచ్చని గోదావరి జలాలను కొల్లేరుకు మళ్లించేందుకు సూచనలతో రావాల్సిందిగా అప్పటి ప్రభుత్వం కోరింది. గత ఎన్నికల్లో తెలుగుదేశం ఓటమి, వైసీపీ విజయం అనంతరం పరిస్థితి తారుమారైంది. వైసీపీ అనుకూలురు కొల్లేరుపై పంజా విసిరారు. నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నా కొల్లేరులో ఎడాపెడా చెరువులు తవ్వేశారు. ఈ ఐదేళ్లలో అటవీ సంరక్షణ అధికారులు అనేక వాహనాలను, యంత్రాలను సీజ్ చేశారు. మరికొంతమందిపై కేసులు నమోదు చేశారు. అయినా వైసీపీ అనుకూలురు దూకుడు తగ్గలేదు.

కొల్లేరులో నీరు ఇంకింది

ఆసియాలోనే అతి పెద్దదైన మంచినీటి సరస్సుగా రాణించిన కొల్లేరు బావురుమంటోంది. గతంతో పోలిస్తే ఈసారి కొల్లేరులో అత్యధిక భాగం ఎండి బీటలు వారింది. సాధారణంగా మే చివరి నాటికి తప్ప మార్చి చివరార్థం నాటికి ఇలాంటి పరిస్థితి రావడం దాదాపు అరుదు. భారీ వర్షాలతో రెండు నెలల క్రితం వరకు నిండుగా ఉన్న కొల్లేరు ఎడారిగా మారింది. వివిధ దేశాల నుంచి వచ్చే పక్షుల గూడు చెదిరింది. పరీవాహంలో తాగునీటి ఎద్దడి ఆరంభమైంది. కొల్లేరులో సాధారణ స్థాయిలో మూడు టీఎంసీల నీరు నిల్వ ఉండడానికి అవకాశం లేదు. రాన్రాను ఆ పరిస్థితి సన్నగిల్లింది. రెగ్యులర్ నిర్మాణం అనుకున్నది అనుకున్నట్టు పూర్తయితే ఈ పరిస్థితి నివారించేవాళ్ళు ప్రకటనలే తప్ప ఆచరణ లేకపోవడంతో వైసీపీ సర్కారులో కొల్లేరుకు కొత్త కష్టాలు ఆరంభమయ్యాయి. అన్ని చేస్తామని చెప్పి చివరకు చేతులెత్తేశారు. రెగ్యులేటర్ల గొప్పలు చెప్పి హామీలతో సరిపెట్టారు. ఎన్నికలకు ముందు జనం ఎదుట సర్కస్ ఫీట్లు చేస్తున్నారు. నేడు నీరు ఇంకి కొల్లేరు వెలవెలబోతోంది.



ఏలూరు రూరల్ మండలం మాధవపురం-గుడివాకలంక రోడ్డులో ఎండిన కొల్లేరు



క్రైస్తవులు గుడ్ ఫ్రైడేను ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటల పరమార్థాన్ని పాస్టర్లు వివరించారు. ఏలూరులో శిలువను మోస్తూ వీధుల్లో ప్రదర్శనలు జరిపారు. 6లో



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, గన్ని వీరాంజనేయులు, చిత్రంలో బడేటి చంటి

ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి

- టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో జిల్లా అధ్యక్షుడు గన్ని, ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి మహేష్ యాదవ్

ఏలూరు రూరల్, మార్చి 29 : ఎన్టీఆర్ ఆశయాల కోసం అహర్నిశలు కృషి చేస్తూ.. ఆయన ఆశయాలను చంద్రబాబు ముందుకు తీసుకువెళుతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం 42వ టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. దెబ్బతిన్న రాష్ట్రాన్ని చక్కదిద్దేందుకు చంద్రబాబు సీఎం కావాలన్నారు. ఇందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఏలూరు టీడీపీ అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య(చంటి) మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాల కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. మాజీ మంత్రి మరడాని రంగారావు, టీడీపీ ఉపాధ్యక్షుడు ఉప్పాల జగదీష్ బాబు, రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ పట్నాల వెంకటేష్ బాబు, దాసరి ఆంజనేయులు, వీరంకి త్రినాథ్, లంకపల్లి మాణిక్యాలరావు, కె.అప్పారావు, టి.జమలయ్య పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఏప్రిల్ 15 వరకు ఓటు నమోదుకు గడువు

ఏలూరు రూరల్, మార్చి 29 : సార్వత్రిక ఎన్నికల్లో మంచి నాయకులను ఎన్నుకోవాలంటే ఓటర్ జాబితాలో పేరు ఉందో ? లేదో ? చూసుకోవాలి. జనవరిలో విడుదల చేసిన తుది జాబితాకు అదనంగా ఇటీవల నమోదు చేసుకున్న ఓటర్ల పేర్లను చేర్చారు. 18 ఏళ్లు నిండిన వారు ఏప్రిల్ 15వ తేదీలోపు కొత్త ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఎన్నికల కమిషన్ గడువు ఇచ్చినట్టు ఏలూరు తహసీల్దార్ ముఖర్జీ తెలిపారు. అడ్రస్ మార్పునకు అవకాశం లేదు. పేరులో తప్పుంటే సరిచేసుకోవచ్చు. ఓటర్‌గా నమోదైనప్పటికి ఎన్నికల రోజున జాబితాలో చాలా మంది తమ పేరు లేదని ఆందోళన చెందుతుంటారు. ముందుగానే జాబితాలో పేరు ఉందో లేదో చూసుకోవడం మంచిది. ఒకవేళ పేరు కనిపించకపోతే వెంటనే కొత్తగా ఓటర్ నమోదుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అర్హతను పరిశీలించి అధికారులు ఓటేసే హక్కు కల్పిస్తారు. గ్రామ, వార్డు సచివాలయం, తహసీల్దార్ కార్యాలయంలోని బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు)కు దరఖాస్తులు అందజేయాలి. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్, సీఈవో ఆంధ్రా వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చు.

వలంటీర్‌పై వేటు

పెనుమంట్ర, మార్చి 29 : అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించిన పెనుమంట్ర మండలం గరువు గ్రామ పంచాయతీ వలంటీర్ బొల్లా లిఖితను విధుల నుంచి తొలగిస్తూ ఎంపీడీవో పద్మజ ఆదేశాలు జారీచేశారు. అధి కార పార్టీ అభ్యర్థి ఎన్నికల ప్రచారా నికి హాజరు కావాలని మహిళలను ఆహ్వానిస్తూ డ్వాక్రా గ్రూపుల్లో పెట్టిన వాయిస్ మెసేజ్‌పై సీ విజిల్‌కు అందిన ఫిర్యాదుపై విచారణ జరిపి ఈ నిర్ణయం తీసుకున్నారు.

సార్వత్రిక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- సీఈవో ముఖేష్ కుమార్ మీనా..
- ఏలూరు జిల్లాలో ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన
- సోషల్ మీడియా ప్రచారంపై నిఘా

ఏలూరు సిటీ, మార్చి 29 : సార్వత్రిక ఎన్నికలకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగు నీరు, టెంట్లు వంటి సౌకర్యాల కల్పనలో పూర్తిస్థాయి శ్రద్ధ వహించాలి' అని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా అధికారులకు సూచించారు. జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించేందుకు శుక్రవారం మీనా ఏలూరు విచ్చేశారు. ఆయనకు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, ఎస్పీ మేరీప్రశాంతి, జేసీ లావణ్యవేణి స్వాగతం పలికారు. కలెక్టరేట్‌లోని మీడియా కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. ఎన్నికల ఏర్పాట్లు, ప్రవర్తనా నియమావళి అమలుపై మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలను నమోదు చేసే విధానం, వాటి పరిష్కార తీరుపై ఆరా తీశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలు, ఫిర్యాదుల వివరాలను కంట్రోల్‌రూమ్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, ఆర్‌వోలకు చేరవేస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్ మాధ్యమాల్లో వచ్చే రాజకీయ పర ప్రకటనలు, సంబంధిత అంశాలను పరిశీలించి వాటిని సంబంధిత ఆర్వోలకు పంపడం ద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు సోషల్ మీడియా విభాగాన్ని పర్యవేక్షిస్తున్న ఉద్యానశాఖ డీడీ రామ్మోహన్ వివరించారు. సీ-విజిల్ పర్యవేక్షక విభాగాన్ని, స్టాటిక్ సర్వే లెన్స్, ఫ్లయింగ్ సర్వే లెన్స్ టీంల వాహనాలకు అమర్చిన జీపీఎస్ విధానం ద్వారా క్షేత్రస్థాయి పరిశీలనలో అవి ఎక్కడ ఉన్నది, నిఘా బృందాల కదలికలను పరిశీలించే కంట్రోల్ రూమ్ నిర్వహణా తీరును పరిశీలించారు. ఎన్నికల కమిషన్‌కు రోజువారీ నివేదికలు పంపే విభాగాన్ని సందర్శించారు. జిల్లాలో ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ వివరించారు.

స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

జిల్లాలో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఎంపిక చేసిన ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలను సీఈవో సందర్శించారు. ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు, చింతలపూడి, పోలవరం, నూజివీడు, కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ ఒకే ఆవరణలో ఉన్నందున ఆయా నియోజకవర్గాల ఓట్ల కౌంటింగ్‌కు వేర్వేరు సముదాయాల్లో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత లేఅవుట్‌ను పరిశీలించగా కలెక్టర్ వివరాలను తెలిపారు. ఓట్ల లెక్కింపు సమయంలో తీసుకోవాల్సిన భద్రతకు సంబంధించి ఎస్పీ, ఇతర పోలీస్ అధికారులకు సీఈవో సూచించారు.



ఎన్నికల ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఈవో మీనా

స్వీప్ కార్యక్రమాలపై సంతృప్తి

స్వీప్ కార్యక్రమాలపై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఓటర్లను చైతన్యపరిచే కార్యక్రమాలను ముమ్మరం చేయాలన్నారు. స్వీప్ జిల్లా నోడల్ అధికారి, డీపీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్, ఐటీడీఏ పీవో ఎం.సూర్య తేజ, అసిస్టెంట్ కలెక్టర్ టి.శ్రీపూజ, డీఆర్వో పుష్పమణి, జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు పాల్గొన్నారు.

■ ఆంధ్రజ్యోతితో ఆఫీసర్

90 శాతం పోలింగ్‌కు కృషి

ఉంగుటూరు ఆర్‌వో ఖాజావలీ



- ఉంగుటూరు నియోజకవర్గం పూర్తి గ్రామీణ వాతావరణంతో కూడుకుని ఉంది. ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, గణపవరం మండలాలు ఉన్నాయి.
- ఉంగుటూరు మండలంలో పురుష ఓటర్లు 31,257,మహిళా ఓటర్లు 32,383, భీమడోలు మండలంలో పురుష ఓటర్లు 25,611 మంది, మహిళా ఓటర్లు 26, 907మంది, నిడమర్రు మండలంలో పురుష ఓటర్లు 18,600 మంది, మహిళా ఓటర్లు 18,676, గణపవరం మండలంలో పురుష ఓటర్లు 25, 684 మంది, మహిళా ఓటర్లు 26, 211మంది ఉన్నారు.
- మొత్తం 2,05334 మంది ఓటర్లు నమోదై ఉన్నారు. దివ్యాంగులు 3, 204 మంది ఉండగా 85 ఏళ్లు పైబడిన ఓటర్లు 982 మంది ఉన్నారు.మొత్తం పోలింగ్ బూత్‌లు 214 ఉండగా 144 ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌లు ఉన్నాయి.
- ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, గణపవరంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. 24 గంటల పాటు నాలుగు టీంలు వాహన తనిఖీలు, ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలెన్స్ టీంలు తిరుగుతున్నాయి. సువిధ పోర్టల్ ద్వారా రాజకీయ పార్టీలు 48 గంటల ముందుగానే సభలకు అనుమతులు తీసుకోవాలి. ప్రస్తుతం ఫాం,7,8లను తాత్కాలికంగా నిలుపుదల చేశాం. కొత్తగా ఫాం 6లు దరఖాస్తు చేసుకోవచ్చు.
- సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహిస్తున్నాం. రాత్రిళ్ళు 10 గంటల తర్వాత ఎన్నికల ప్రచారం చేయడం ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తాయి. గుడి, బడి ప్రాంగణాల్లో ఎన్నికల ప్రచారం చట్టరీత్యా నేరం. ఎటువంటి ఫిర్యాదునైనా సీ-విజిల్ ద్వారా చేయవచ్చు.

- ఉంగుటూరు

సాగు నీరివ్వండి..



కొవ్వలిలో నీళ్లు లేక ఎండుతున్న వరి పొలంలో నిరసన తెలుపుతున్న రైతులు

- కొవ్వలి పంట పొలాల్లో రైతుల నిరసన
- 200 ఎకరాల్లో ఎండుతున్న వరి పంట

దెందులూరు, మార్చి 29 : దేశానికి అన్నం పెట్టే రైతు వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేడు దేహి అని అడుక్కునే పరిస్థితులు వచ్చాయని, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వ్యవసాయ ప్రణాళిక, ముందు చూపు లేకపోవడంతో సాగునీరు అందక వరి పొలాలు ఎండుతున్నాయని రైతులు ఆవేదన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దెందులూరు మండలంలోని కొవ్వలి మొండుకోడు కాల్వ గట్టు పరిధిలోని జిలేడు దిబ్బ దాటిన తర్వాత తూము నెంబర్-2 లో శివారు వరి పొలాలు సుమారు 200 ఎకరాలకు సాగునీరు అందక వరి పంట ఎండుతోందని శుక్రవారం రైతులు పంట పొలాల్లో నిరసన తెలిపారు. ఇరిగేషన్ అధికారులకు ఫోన్ చేస్తుంటే పట్టించుకోవడం లేదని, 48 గంటల లోగా సాగు నీరు అందించకపోతే తాము తీవ్రంగా నష్టపోతారని, ఆపై నీరు అందించినా ఉపయోగం ఉండదని పేర్కొన్నారు. వరి పంట చివరి వరకు సాగు నీరు అందిస్తామని అధికారులు చెబితేనే పంటలు వేశామని, కానీ ఇప్పుడు సాగు నీటిని వరి పొలాలకు బదులు చేపల చెరువులకు అక్రమంగా తరలించేందుకు సహకారం అందిస్తూ వరి రైతులను పట్టించుకో వడం లేదని వాపోయారు. కృష్ణా, గోదావరి కాల్వలకు మా వరి పొలాలు శివారున ఉండడంతో ఎవరూ పట్టించుకోవడం లేదని వెంటనే అధికారులు స్పందించి సాగునీరు అందించి ఆదుకోవాలని నినాదాలు చేశారు.

రూ.లక్ష అప్పు చేసి సాగు



రూ.లక్ష అప్పు చేసి కౌలుకు పొలం తీసుకుని వరి పంట వేసి పెట్టుబడులు పెట్టాను. ఇరవై రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఈ సమయంలో ఆఖరి రెండు తడులకు సాగునీరు అందిస్తే పంట దక్కుతుంది. లేదంటే రైతులు తీవ్రంగా నష్టపోతాము.

- పూజారి సురేష్ కౌలు రైతు కొవ్వలి

ఆఖరి తడికి సాగునీరు అందక..



రూ.నాలుగు లక్షలు అప్పు చేసి 20 ఎకరాలు కౌలుకు తీసుకుని వరికి పంట వేశాను. పంట బాగుం దని, 25 రోజుల్లో చేతికి వస్తుందని సంబరపడ్డాం. కానీ ఆఖరి తడి సాగునీరు రాక వరి గింజలు పాలు పోసుకోక తప్పలుగా మారుతున్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే అప్పులు పాలు కావడం ఖాయం.

- పొన్నూరా పారానాయుడు, కొవ్వలి

కళ్ల ముందే ఎండుతోంది..



రెండు ఎకరాలు సాగు చేశా. మరో 15 రోజుల్లో పంట చేతికి అందేది. కాని చివరి దశలో సాగు నీరు లేక కళ్ల ముందే పంట ఎండిపోతుంటే ఏడుపు వస్తోంది. నీరు అందించలేము అని అధికారులు చెబితే పంట వేయడం మానివేసేవాళ్లం.

- అన్నేపు లక్ష్మణరావు రైతు, గాంధీ నగర్

అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎక్కడా?



ఆఖరి ఎకరా వరకు సాగు నీరు అందిస్తామని, ఒక ఎకరం కూడా ఎండనీయమని ప్రజా ప్రతినిధులు, అధికారులు చెబితే నిజమని నమ్మి పంట వేశాం. ఇప్పుడు నీరందక పంట ఎండుతుంటే వారు ఎక్కడ కనిపించడం లేదు. .

- బండి సత్యనారాయణ కొవ్వలి

పంచాయతీ నిధులు పక్కదారి!

- మేజర్ పంచాయతీలకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు బకాయిలు
- సర్‌చార్జి, స్టాంపు డ్యూటీ.. నిధుల విడుదలలో జాప్యం..ముగియనున్న ఆర్థిక సంవత్సరం
- గగ్గోలు పెడుతున్న సర్పంచ్‌లు

ఏలూరు రూరల్, మార్చి 29: సర్‌చార్జీ, స్టాంప్‌డ్యూటీ రూపంలో పంచాయతీలకు జమ కావాల్సిన నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టించింది. పంచాయతీలతో పాటు మండల పరిషత్‌కు రావాల్సిన నిధులను విడుదల చేయకుండా జాప్యం చేస్తోంది. స్థానిక సంస్థలకు స్టాంప్ డ్యూటీ రూపంలో ఇవ్వాల్సిన నిధులను విడుదల చేయాలని జిల్లాలోని సర్పంచ్‌లు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే వారే కరువైయ్యారు. మరో 24 గంటల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తోంది. మరోవైపు ఎన్నికల హడావుడిలో అన్ని విభాగాల అధికారులు నిమగ్నమైయ్యారు. ఏటా మార్చిలో ట్రెజరీల ద్వారా నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం ఫ్రీజింగ్ విధిస్తోంది. దీంతో పంచాయతీ నుంచి ట్రెజరీలకు వెళ్లిన బిల్లులు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ఎన్నికల వేళ కావడంతో పంచాయతీ, మండల పరిషత్‌లకు సంబంధించిన నిధులను విడుదల చేయించేందుకు ప్రభుత్వం ఎంతమేర చొరవ తీసుకుంటుందనే అంశంపై అనేక అనుమానాలను సర్పంచ్‌లు వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రెండునెలలకు ఒకసారైనా క్రమం తప్పకుండా జమ చేయాల్సిన నిధులను రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు ఏ కారణంతో నిలిపివేశారో స్పష్టత ఇవ్వడం లేదు. ఈ నిధులను ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా విడుదల చేయాలని సర్పంచ్‌లు కోరుతున్నారు. జిల్లాలో 941 మండలాలు, పంచాయతీలు ఉన్నాయి. ఆయా పంచాయతీల పరిధిలో భూములు, ఇళ్ల స్థలాలు, గృహాలు, ఇతరాలు, క్రయ, విక్ర యాల సమయంలో స్టాంప్ డ్యూటీని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వసూలు చేస్తారు. స్టాంప్ డ్యూటీ వసూలు చేసిన మొత్తంలో మండల పరిషత్‌లో ఐదుశాతం, పంచాయతీలో ఐదుశాతం వాటా చొప్పున సర్‌చార్జి స్టాంప్‌డ్యూటీగా విడుదల చేయాల్సి ఉంది. గతంలో నెలకోసారి ఈ నిధులను ట్రెజరీల ద్వారా పంచాయతీ, మండల పరిషత్‌లకు జమ చేసేవారు. స్టాంప్ డ్యూటీ నిధులు జిల్లాలో సుమారు రూ.110 కోట్లకు పైగా విడుదల చేయకుండా ఆపారని సర్పంచ్‌లు గగ్గోలు పెడుతున్నారు. స్టాంప్‌డ్యూటీ రూపంలో వచ్చిన నిధులు పంచాయతీలకు వెన్నుదన్నుగా ఉండేవి. 2020, డిసెంబరు నుంచి నిధులను ప్రభుత్వం నిలిపివేసింది. వైసీపీ అధికారం చేపట్టాక కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే 14,15 ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ పాలక వర్గాలకు కనీస సమాచారం ఇవ్వకుండానే మళ్లించేశారని, స్టాంప్ డ్యూటీ నిధులను విడుదల చేయకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

ఏప్రిల్ రేషన్.. ఇంటింటికి

- ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి ఎండీయూ వాహనాలకు స్టిక్కర్లు

ఏలూరు సిటీ, మార్చి 29 : ఏప్రిల్ నెల రేషన్ సరఫరా ఏవిధంగా జరుగుతుందనే మీమాంసకు తెరపడింది. ఎండీయూ వాహనాలకు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా స్టిక్కర్లు అతికించడంతో ఏప్రిల్‌లో ఇంటింటికీ రేషన్ సరఫరా జరుగుతుందని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారులు చెబుతున్నారు. జిల్లాలో మొత్తం 6,34,219 రేషన్ కార్డుదారులు ఉండగా 395 ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ అందిస్తున్నారు. ఆ వాహనాలపై ఈ రేషన్ సరఫరాకు సంబంధించి ప్రచారం ఉండటంతో ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందని, అందువల్ల రేషన్ ఇంటింటికీ సరఫరా అవుతుందా.. అన్న ప్రశ్న తలెత్తింది. అయితే ఆ వాహనాలపై ప్రభుత్వ ప్రచారాలు కనబడకుండా స్టిక్కర్లు అతికించడంతో ఇంటింటికీ ఏప్రిల్‌లో రేషన్ సరఫరా జరుగుతుందని, అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి ఎస్ సూర్యనారాయణ రాజు తెలిపారు.

జగన్ పాలనలో విచ్చలవిడిగా డ్రగ్స్, మత్తు మందులు


మినీ మేనిఫెస్టో వివరిస్తున్న బడేటి చంటి

ఏలూరు టూటౌన్, మార్చి 29: సైకో జగన్ పాలనలో డ్రగ్స్, మత్తుమందు, నాశిరకం మద్యం విలయతాండవం చేస్తున్నాయని టీడీపీ, జనసేన బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి విమర్శించారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా చంటి, జనసేన నాయకులు రెడ్డి అప్పలనాయుడుతో కలిసి పర్యటించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మూడు పార్టీలు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి కరువైందన్నారు. రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాలంటే కూటమిని గెలిపించాలన్నారు. గూడవల్లి శ్రీనివాస్, పి.వెంకట్రావు, ఎం.శ్రీనివాసరావు, విజయలక్ష్మి, పెద్దిబోయిన శివకుమార్, పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం టీడీపీ కూటమిని గెలిపించాలి


సూపర్ సిక్స్ పథకాలు వివరిస్తున్న రోషన్

లింగపాలెం, మార్చి 29: ధర్మాజిగూడెంలో టీడీపీ గరిమెళ్ళ చలపతిరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. గ్రామంలో సమస్యలను పలువురు మహిళలు రోషన్ కుమార్‌కు విన్నవించారు. తెలుగుదేశంపార్టీ గెలిచిన మూడు నెలల్లోపు ప్రతి గ్రామంలో తాగునీరు, డ్రైనేజీలు, రోడ్ల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. వేంపాటి ప్రసాద్, మోరంపూడి ప్రసాద్, ముసునూరి రాము, గారపాటి బుజ్జియ్య కొత్తూరి నాగమణి, మోరంపూడి మల్లికార్జునరావు, గుత్తా ప్రసాద్, మాదాసు కృష్ణ, గోడా అనిష్, భారతి, నాగబాబు, పిల్లల శ్రీనివాస్‌యాదవ్, తెలుగుదేశం, బీజేపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

వేంపాడులో మద్దిపాటి వెంకట్రాజు ప్రచారం


ఇంటింటి ప్రచారంలో మద్దిపాటి వెంకట్రాజు

ద్వారకాతిరుమల, మార్చి 29: వేంపాడులో టీడీపీ మండల అధ్యక్షుడు లంకా సత్యనారాయణ నేతృత్వంలో టీడీపీ కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తొలుత పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నేతల ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ పార్టీ అజెండాను, సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఆయనకు ప్రజలు అఖండ స్వాగతం పలికి, పూలవర్షం కురిపించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ కూటమికి ప్రజల మద్దతు రోజురోజుకు పెరుగుతుందని, భారీ విజయాన్ని సాధిస్తామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు ప్రజలు సహకరించాలి


పెదనింద్రకొలనులో ధర్మరాజు పాదయాత్ర

నిడమర్రు, మార్చి 29: కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని కూటమి ఉమ్మడి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. పాదయాత్రలో భాగంగా శుక్రవారం నిడమర్రు బాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదనింద్రకొలను, పత్తేపురం, అప్పారావుపేట, రావులపర్రు, ఉంగుటూరు, నారాయణపురం, చేబ్రోలు, కైకరం, పూళ్ల చేరుకొన్నారు. పెదనింద్ర కొలను, చిననింద్రకొలనులో మహిళలు పెద్దఎత్తున ధర్మరాజుకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఎన్నికలలో జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలన్నారు. జనసేన మండల అధ్యక్షుడు ముత్యాల స్వామి, నిమ్మల దొరబాబు, పూళ్ల మాజీ నోచర్ల శ్రీనివాసరావు, వంగా రఘు, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: మండలంలోని అప్పారావుపేట, రావులపర్రు, ఉంగుటూరు, నారాయణపురం, చేబ్రోలు, కైకరం గ్రామాలలో పాదయాత్ర కొనసాగింది. దారి పొడవునా మహిళలు హారతులు ఇచ్చి ధర్మరాజును ఆశీర్వదించారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో కుంటుపడిన అభివృద్ధి : చిర్రి బాలరాజు


చిర్రి బాలరాజుకు మహిళల హారతి

జీలుగుమిల్లి, మార్చి 29 : వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుబడిందని పోలవరం జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజు అన్నారు. పి.అంకం పాలెంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. బాలరాజుకు మహిళలు హారతి పట్టారు. ములగలంపల్లి, టి.గంగన్నగూడెం, పి.అంకపాలెం కామయ్యపాలెం గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులు ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు.


పెదవేగిలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద కార్యకర్తల నివాళి




పోలవరం, చింతలపూడి, కొయ్యలగూడెంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో బొరగం శ్రీనివాసులు, సొంగా రోషన్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు

తెలుగు ప్రజల ఆత్మగౌరవం

తెలుగుదేశం

జిల్లాలో ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

ఉంగుటూరు, మార్చి 29: తెలుగువారి ఆత్మ గౌరవానికి ప్రతీక ఎన్టీఆర్ అని, తెలుగుదేశం పార్టీతో తెలుగు వారి గౌరవం విశ్వవ్యాప్తమైందని టీడీపీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయుడు అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉంగుటూరు సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రెడ్డి సూర్యచంద్రరావు, చింతల శ్రీనివాస్, ఉన్నమట్ల సునీత, నోచర్ల శ్రీను, బండారు మధు, నేకూరి ఆశీర్వాదం, ఇమ్మణ్ణి గంగాధరరావు, తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు: ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు క్యాంపు కార్యాలయంలో టీడీపీ జెండా ఆవిష్కరించారు. ప్రతి కార్యకర్త, టీడీపీ నాయకులు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని గన్ని కోరారు. జనసేన, టీడీపీ, బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆయన అన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● దెందులూరు: టీడీపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంపంగి వేణుగోపాల్ తిలక్‌కొలుసు నాని టీడీపీ నేతల ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి యిప్పిలి వెంకటేశ్వరావు, గారపాటి కొండయ్య చౌదరి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ ఏసమ్మ, ఎంపీటీసీ శేషారత్నం, మహేష యాదవ్, దాసే శ్రీను, జహీర్, ఉప సర్పంచ్ మురళీకృష్ణ పాల్గొన్నారు. పోతునూరులో బోడేటి మోహన్‌బాబు, నున్న లక్ష్మణ్‌బాబు, గాలాయగూడెంలో పూజారి శ్రీనివాసరావు, ఏనుగు రామకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు.

● కుక్కునూరు: టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి నివాళులర్పించారు. కోటగిరి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయిన తరువాత పేదలకు కూడు, గూడు, గుడ్డ, బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలతో రాష్ట్రంలో సుపరిపాలన అందించారన్నారు. చంద్రబాబు నాయకత్వంలో పార్టీని మరింత పటిష్ఠం చేయాలని పిలుపునిచ్చారు. వంటిపల్లి గంగరాజు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, బాలాజీ, సురేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: ప్రధాన రహదారిపై ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. గరిమెళ్ళ చలపతిరావు ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. మోరంపూడి మల్లికార్జునరావు, పిల్లల శ్రీనివాసరావు, చెన్ను శ్రీను, అసిలేటి అజయ్, గజ్జా వెంకటేశ్వరరావు, తాతిన రాధాకృష్ణ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● నిడమర్రు: ప్రజా సంక్షేమమే తన అజెండాగా తొలి సంక్షేమ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన ఘనత ఎన్‌టి రామారావుకే దక్కుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు ముత్యాల స్వామి అన్నారు. ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ జెండా ఆవిష్కరించారు. అంబళ్ల విజయభాస్కర్, పొల్నారి సింహాచలం, సత్తినీడి నాని పాల్గొన్నారు.

● పోలవరం: మండల కేంద్రంలో టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొరగం మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో తెలుగువారి ఆత్మగౌరవం కాపాడడానికి టీడీపీ స్థాపించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

● చింతలపూడి: తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి, ప్రగడవరం, వెంకటాపురం, రేచర్ల గ్రామాల్లో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. రోషన్‌కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే ఈ రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. జగ్గవరపు ముత్తారెడ్డి, పక్కాల వెంకటేశ్వరరావు, కోంద్రు దేవ, బోడా అనిష్‌కుమార్, చిట్లూరి ధర్మరాజు, టి.అప్పారావు, బోడా నాగభూషణం, పి.చంద్రశేఖర్‌రెడ్డి, కె.నాగరాజు, కె.రాజశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, కె.ఉపేంద్ర, సూరానేని గోపి, ఆది జగన్, జనసేన నాయకులు చీదరాల మధుబాబు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

● కామవరపుకోట: కొత్తూరులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, టీడీపీ నేతలు కోనేరు వెంకట సుబ్బారావు, నూతి రాటాలు, నెక్కలపు సూర్యనారాయణ, నన్నా హరిశ్చంద్ర, పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

● పెదవేగి: టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు మహనీయుడని ఈడ్పుగంటి సుందరయ్య అన్నారు. పార్టీ ఆవిర్భావ వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. పార్టీ నాయకులు పెదర్ల రాంబాబు, దారిబోయిన సత్యనారాయణ, బిర్లంగి పెద్దులు, వీరంకి నాగరాజు, షేక్ హుస్సేన్, దుక్కిపాటి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతీ ఒక్కరు ఎన్‌టీఆర్ ఆశాయాలకు అనుగుణంగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు జ్యేష్ఠ రామకృష్ణ, తెలుగు మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శి మేఘలాదేవి, బలుసు నాగేశ్వరరావు, బెల్లాని శ్రీను, తదితర నాయకులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ అధ్యక్షతన ఎన్టీఆర్ విగ్రహానికి సీనియర్ టీడీపీ నాయకులు మండవ లక్ష్మణరావు పూలదండ వేసి ఘన నివాళులర్పించారు. రావూరి కృష్ణ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఎన్టీఆర్ నగర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద పెనుమర్తి రామ్‌కుమార్, మద్దిపాటి నాగేశ్వరరావు, బుట్టాయగూడెం రోడ్‌లోని ఎన్టీఆర్ విగ్రహం మున్సిపల్ కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు, శ్రీనివాసపురం రోడ్డులోని లక్ష్మీనారాయణ థియేటర్ ఎదురుగా ఎన్టీఆర్ విగ్రహం వద్ద కౌన్సిలర్స్ కరటూరి రమాదేవి, తెల్లగారపు జ్యోతి జెండాలు ఆవిష్కరించారు. బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, గుమ్మడి ప్రసాద్, షేక్ ముస్తఫా, కొంచాడా ప్రసాద్, తూటికుంట దుర్గారావు, జనసేన నాయకులు మేక ఈశ్వరయ్య, బొబ్బర్ రాజ్ పాల్ కుమార్, పగడం సౌభాగ్యవతి, మారిశెట్టి బాల చిట్టమ్మ, చిట్రోజు తాతాజీ, తూటికుంట రాము, జనసేన కౌన్సిలర్ వలవల తాతాజీ, షేక్ పీరు, కొండ్రెడ్డి కిషోర్, అల్లూరి రామకృష్ణ, చేను ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు

గుర్వాయిగూడెంలో మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు ప్రసంగించారు. ముళ్లపూడి గంగాధర శ్రీనివాస్, కుక్కల మాధవరావు, బుసా సత్యనారాయణ రెడ్డి, రాగాని రామకృష్ణ, గొల్లమందల శ్రీనివాస్, ఎలికే ప్రసాద్, శీలం రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


కె.కోట, నిడమర్రు మండలాల్లో టీడీపీ పతాకావిష్కరణ


జంగారెడ్డిగూడెంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాల్లో నేతలు


కుక్కునూరులో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నేతలు, కార్యకర్తల నివాళి


దెందులూరులో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న నేతలు


ఉంగుటూరులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద గన్ని నివాళి

జగనన్న కాలనీ వాసులకు భారీగా విద్యుత్ బిల్లు

కామవరపుకోట, మార్చి 29: ఆడమిల్లి జగనన్న లేఅవుట్‌లలో నిర్మించిన గృహాలకు విద్యుత్ ఉచితం అని అధికారులు లబ్ధిదారులకు చెప్పారని, భారీ మొత్తం బిల్లులు వచ్చాయని స్థానికులు వాపోయారు. బిల్లు చూసి శుక్రవారం వారు ఆందోళన వ్యక్తం చేశారు. జగనన్న కాలనీలకు విద్యుత్ బిల్లులు ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

చేబ్రోలు లయన్స్ క్లబ్ అవార్డుల పంట

ఉంగుటూరు, మార్చి 29: చేబ్రోలు లయన్స్ క్లబ్ ఉత్తమ పురస్కారం అందుకుంది. ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, జిల్లా గవర్నర్ పంకజాక్షన్, గట్టిం మాణిక్యాలరావు నుంచి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శీతాల సత్యనారాయణ, అడపా శోభారాణి, జోన్ ఛైర్మన్‌గా వంకిన ప్రతాప్, గుణ్ణం బుల్లెబ్బాయి అవార్డులు అందుకున్నారు. గత ఏడాది రూ.60లక్షలతో ఆడిటోరియంను అభివృద్ధి చేయడంతో ఈ పురస్కారం లభించిందని వారు వివరించారు.

ఏలూరు నగరంలో వాహనాల తనిఖీ

ఏలూరు క్రైం, మార్చి 29 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ట్రాఫిక్ సీఐ కాగిత శ్రీనివాసరావు, సిబ్బంది పాతబస్టాండ్ వద్ద శుక్రవారం సాయంత్రం వాహనాల తనిఖీలు నిర్వహించారు. రికార్డులు లేనివారికి ఈ చలానాలు విధించారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్సు ఉండాలని, వాహన పత్రాలు, బీమా ఉండాలన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన కార్యక్రమం

పెదపాడు, మార్చి 29: ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య సూచించారు. పెదపాడులో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని, 18 ఏళ్ల లోపు పిల్లలను ఎన్నికల ప్రచారంలో ఉపయోగించరాదన్నారు. పెదవేగి సీఐ శ్రీనివాస్‌కుమార్, ఎస్సై శుభశేఖర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


పోలవరంలో ఇఫ్తార్ విందులో ముస్లింలు

రంజాన్ పవిత్ర ఉపవాస దీక్షలు

పోలవరం, మార్చి 29: రంజాన్ పవిత్ర ఉపవాస దీక్షలు కొనసాగుతున్నాయి. రంజాన్ మాసం మూడవ శుక్రవారం సందర్భంగా మసీదులో జమాతె మసీదు కమిటీ అధ్యక్షులు ఎండి యాసీన్ షరీఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక నమాజు చేశారు. సాయంత్రం ఇఫ్తార్ విందు నిర్వహించారు. అధిక సంఖ్యలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో నమాజు చేసి పేదలకు దాన కార్యక్రమాలు నిర్వహించారని మసీదు కమిటీ అధ్యక్షులు తెలిపారు.

చానమిల్లిలో పల్లాలమ్మ ఉత్సవాలు



నిడమర్రు, మార్చి 29: చానమిల్లి గ్రామ దేవత పల్లాలమ్మ జాతర శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. ఏప్రిల్ 2 వరకు జరుగనున్న ఉత్సవాలకు కమిటీ ఏర్పాట్లు చేసింది. శుక్రవారం సాయంత్రం బ్యాండు మేళం, గరగ నృత్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తుల విరాళం సుమారు రూ.5 లక్షలతో తయారు చేసిన వెండి మకర తోరణం అమ్మవారికి అలంకరించారు. మొదటి రోజు ఉత్సవాల్లో గ్రామస్తులతో చుట్టుపక్కల గ్రామాల వారు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన కనకదుర్గ ఉత్సవాలు



బుట్టాయగూడెం, మార్చి 29: రెడ్డిగణపవరంలో కనకదుర్గ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి మహోత్సవాలు శుక్రవారం ముగిశాయి. హోలీ పౌర్ణమి రోజున ప్రారంభమైన ఉత్సవాలు ఐదు రోజులపాటు ఘనంగా జరిగాయి. ఏజెన్సీ నలుమూలలు నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వేలాదిగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ పర్యవేక్షణలో అర్చకులు నాగభట్ల పద్మనాభశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ధర్మకర్త భౌమరాజు ధనుంజయరాజు తెలిపారు.

సోమవరప్పాడులో జనార్దనస్వామి బ్రహ్మోత్సవాలు



దెందులూరు,మార్చి 29 : సోమవరప్పాడు జనార్ధనస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. తొలుత ఉత్సవ ఆలయ నిర్వాకులు చలసాని శ్రీధర్ దంపతులు, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు నూతన వస్త్రాలను సమర్పించారు. ఆలయం అవరణలో ,సంప్రదాయ బద్ధంగా కోలాటం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకున్నారు.

కనకదుర్గ ఆలయాల్లో అన్నదానం

పోలవరం, మార్చి 29 : మండలంలో అమ్మవారి ఆలయాల్లో శుక్రవారం పలుచోట్ల అన్నదానం నిర్వహించారు. బస్ షెల్టర్ వద్ద, బంగారమ్మపేట, ఎల్ఎన్‌డీ.పేట కనకదుర్గ ఆలయాలు, పోలవరం వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

ఈడా వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌కు డాక్టరేట్



ఏలూరు టూటౌన్, మార్చి 29: ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారటీ వైస్ చైర్మన్ డి.చంద్రశేఖర్‌కు రాయలసీమ యూనివర్సిటీ పీహెచ్‌డీ అవార్డు అందించింది. సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్స్, ఉమన్ ఎంపవర్ మెంట్‌పై చేసిన చంద్రశేఖర్ పరిశోధనకు పీహెచ్‌డీ డిగ్రీ వరించింది. యోగి వేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి రిసెర్చ్ సూపర్‌వైజర్‌గా వ్యవహరించారు.


జంగారెడ్డిగూడెం పట్టణంలో శిలువ మార్గం


ఏలూరులో శిలువతో క్రైస్తవుల ర్యాలీ


పెదవేగిలో క్రైస్తవ మతగురువుల శిలువ యాత్ర


టి.నరసాపురంలో శిలువతో ఆర్‌సీఎం గురువులు

గాడ్ ఫ్రైడే

శిలువతో క్రైస్తవుల ర్యాలీ.. చర్చిలో ప్రార్థనలు

ఏలూరు కల్చరల్, మార్చి 29: జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో శుక్రవారం క్రైస్తవులు గుడ్ ఫ్రైడే నిర్వహించారు. ఏసుక్రీస్తు ప్రాణత్యాగం చేసిన రోజు కావడంతో క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మానవాళికి ఏసు క్రీస్తు ఇచ్చిన సందేశాలను పాస్టర్లు ప్రబోధించారు. క్రీస్తు శిలువ మార్గ ప్రదర్శనతో క్రైస్తవులు దేవునికి క్షమాస్వాగతం పలికారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శనివారపుపేట సెయింట్ పాల్ సీఎస్ఐ చర్చిలో ప్రార్థనల్లో టీడీపీ అభ్యర్థి బడేటి చంటి పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ లంకపల్లి మాణిక్యాలరావు, అరిగెల రాజు, కిషోర్, అనంతరాజు, మోజేష్, పెద్దాడ రాము, వందనాల శ్రీనివాస్, సోమిశెట్టి రాము, పాలస్ తదితరులు పాల్గొన్నారు.

శనివారపుపేట నుంచి డివైన్‌మెర్సీ ఆర్‌సీఎం సంఘస్తులు భారీ ర్యాలీ నిర్వహించారు. శిలువను మోస్తూ గీతాలను ఆలపిస్తూ పాదయాత్ర చేశారు. సమస్త మానవాళి చేసిన పాపాల కోసం ఆయన శిలువపై ప్రాణాలర్పించారని, సంఘ పెద్దలు ఆర్.జోసఫ్‌తంబి, లంకపల్లి సుగుణరావు, కాకర్ల సందీప్ తెలిపారు. మండలంలోని పాలగూడెం, జాలిపూడి, చాటపర్రు, గుడివాకలంక, పత్తికోళ్ళ లంక, పైడిచింతపాడు గ్రామాల్లో చర్చిల్లో ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు 40 రోజులుగా చేస్తున్న ఉపవాస దీక్షలు ముగిశాయి. ప్రత్తికోళ్ళ లంక బైబిల్‌మిషన్ చర్చిలో ఫాదర్ బి.జె సుజీవరాజు, దీవెనమ్మ ప్రార్థనలు చేశారు. మాజీ ఎంపీపీ మోరు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: నగరంలో క్రైస్తవులు శిలువను మోస్తూ ర్యాలీ నిర్వహించారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆర్‌సీఎం, సీఎస్ఐ, ఐసీఎం, పెంతికోస్త్, లూథరన్, సాల్వేషన్ ఆర్మీ, ఎల్ఈఎఫ్, వలివల ప్రార్థన మందిరం, పెనూయల్ చర్చ్, మన్నా చర్చ్‌లతో సహా పలు చర్చ్‌లలో క్రీస్తు శిలువ బలి యాగం గురించి వివరించారు. ఏలూరు కథోలిక పీఠాధిపతి మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు పొలిమేర ఆధ్వర్యంలో సెంట్ థెరిస్సా ఉన్నత పాఠశాల నుంచి అమలోద్భవి చర్చ్ వరకు ఆర్‌సీఎం ఫాదర్లు, సిస్టర్లు భక్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. బిషప్ జయరావు శిలువను మోస్తూ వీధుల్లో తిరిగారు. వంగాయిగూడెం ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో ఫైర్ స్టేషన్ వరకు శిలువ ర్యాలీ నిర్వహించారు. ఐసీఎం చర్చిలో బిషప్ జాన్‌ఎస్‌డీ రాజు దేవుని మందిరంలో క్రీస్తు శిలువపై మాట్లాడిన ఏడు మాటలు వివరించారు. బిషప్ కారుపాటి శ్యామ్‌సాగర్ ఎల్ఈఎఫ్ చర్చిలో సురేష్ మార్కస్, ఒలివల ప్రార్థన మందిరంలో ఆడమ్స్, మన్నా చర్చ్ బిషప్ రెవరెండ్ ఎలీషారాజు, పాస్టర్ జ్యోతిరాజు ఆధ్వర్యంలో సిలువ ధ్యానాలను నిర్వహించారు.

● బుట్టాయగూడెం: గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. బుట్టాయగూడెం ఆర్‌సిఎం చర్చి ఫాదర్స్ జోసెఫ్ సిరిపురం, ఎం.విలియం సంఘస్తులు మండల కేంద్రంలో శిలువ యాత్రను నిర్వహించి ప్రధాన కూడళ్లలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. లూథరన్ చర్చి పాస్టర్ ఎంఎ ఆమెన్ ఏసు పలికిన ఏడు మాటలను వివరించారు. యు.సూర్యప్రకాశరావు, కె.విమల, వి.ప్రసంగిరాజు, బి.మాలని, టి.రాజు, కోరం దుర్గారావు, చిడిపి గంగాధర్, రంపాల రాజు, పళ్ళ సూరిబాబు, ఎస్.అనిల్, శిశుపట్నాయక్ పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో శిలువ మార్గం నిర్వహించారు. ఫాదర్ కల్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో వందలాది మంది క్రైస్తవులు క్రీస్తు శిలువ శ్రమను స్మరించారు. అనంతరం చర్చి ఆవరణలో కల్యాణ్ కుమార్ ప్రసంగించారు. సిస్టర్ అమలరాణి, నిర్మల హాస్పిటల్ మెడికల్ సూప రిండెంట్ డాక్టర్ బిందు ఫిలిప్, యువతులు, సంఘస్తులు పాల్గొన్నారు.

● దెందులూరు: మండలంలో పలు గ్రామాల్లో గుడ్ ఫ్రైడే క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దెందులూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ అమ్మన్ రాజా, క్రైస్తవులు శిలువను మోసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పోతునూరు, దోసపాడు గ్రామాల్లో శిలువను మోస్తూ క్రైస్తవ గేయాలతో గ్రామాల్లో ప్రదర్శన చేశారు. చల్లచింతలపూడిలో ఫాదర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు, సంఘస్తుల ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు.

● టి.నరసాపురం: తెడ్లం, బొర్రంపాలెం, మల్లుకుంట, టి.నరసాపురం, గ్రామాల్లో క్రైస్తవులు శిలువ మోస్తూ ర్యాలీ నిర్వహించారు. టి.నరసాపురం విచారణ గురువు కొప్పుల రాయప్ప, పాస్టర్ జి.జ్ఞాన్ రాజు ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. పాస్టర్లు కె.నిరీక్షణరావు, సీహెచ్.హోషేయ, బ్రదర్ అనిల్, సిహెచ్ రమేష్, వై.పాల్ తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: జూబ్లీనగర్ ఆర్‌సీఎం చర్చిలో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. సింగగూడెం నుంచి శిలువ మార్గం నిర్వహించారు. ఫాదర్ కుమార్ మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే ఎన్నో త్యాగాలకు నిదర్శనం అన్నారు. ధర్మాజిగూడెం, లింగపాలెం, రంగాపురం, తదితర గ్రామాల్లో క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. ఆర్‌సీఎమ్ సిస్టర్స్, ఉపదేశకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

● పోలవరం: మండలంలో పలుచోట్ల చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పోలవరం సీయోను ప్రార్థనా మందిరం, కర్మేలు ప్రార్థనా మందిరాలలో పీజే.సుధాకర్, ఆకుమర్తి డేవిడ్ రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ఉపవాస ప్రార్థనా కూడికలు నిర్వహించారు. సెయింట్ జోసెఫ్ కథోలిక చర్చి ఫాదర్ ఆర్.భరత్ లానియా శిలువ మోస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● కామవరపుకోట: క్రైస్తవులు శిలువతో ప్రదర్శన, ప్రార్థనలు చేశారు. ఫాదర్లు క్రైస్తవ సందేశాలను అందించారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, కొండూరు భాస్కరరావు, క్రైస్తవులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

● చింతలపూడి: ఆర్‌సీఎం చర్చి ఫాథర్, మ్యాథ్యు ఆధ్వర్యంలో కోర్టు సెంటర్ నుంచి బోయగూడెం చర్చి వరకు శిలువ యాత్ర సాగింది. యాత్ర మార్గంలో ముస్లింలు శీతల పానీయాలు అందించగా, వెలమపేట యూత్ మజ్జిగ ప్యాకెట్లను అందజేసింది. ఫాతిమాపురం, ఆంథోనినగర్, చింతలపూడి సిలువ యాత్రలో సొంగా రోషన్‌కుమార్ శిలువ మోసి తమ భక్తిని చాటారు.

● పెదవేగి: త్యాగానికి, సేవా నిరతికి చిహ్నం క్రీస్తు శిలువ ధారణ అని న్యాయంపల్లి విచారణ గురువు ఫాదర్ బాలస్వామి అన్నారు. క్రైస్తవులు శిలువను మోస్తూ వీధుల్లో తిరిగి, క్రీస్తు బోధనలను వినిపించారు. సర్వ మానవాళి పాపాలను తొలగించడానికి క్రీస్తు సిలువ మార్గాన్ని అనుసరించాడని ఫాదర్ దివాకర్ చెప్పారు. విజయరాయిలో జరిగిన కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సిలువను మోశారు.

● పెదపాడు: మండలంలోని పునుకొల్లు సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో శిలువ యాత్ర నిర్వహించగా, పెద్ద సంఖ్యలో సంఘ విశ్వాసులు, మహిళలు, చిన్నారులు ప్రార్థనలు చేశారు. ప్రేమానురాగాలు, క్షమాగుణం కలిగి ఉండాలంటూ విశ్వాసులకు బోధించారు.

● ద్వారకాతిరుమల: ఏసు చూపిన ప్రేమ మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించి పరిశుద్ధులు కావాలని పాస్టర్లు సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే ఘనంగా చేశారు. దొరసానిపాడు చర్చి వద్ద ఎంపీపీ బొండాడ మోహినీ వెంకన్నబాబు దంపతులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శిలువతో గ్రామంలో తిరిగారు. సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: మండలంలోని అన్ని గ్రామాల చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గవరవరం ఆర్‌సీఎం చర్చి నుంచి కొయ్యలగూడెం వరకు ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొన్నారు.


దెందులూరులో శిలువ యాత్రలో పాస్టర్, క్రైస్తవులు


కొయ్యలగూడెం గుడ్‌ఫ్రైడే వేడుకల్లో క్రైస్తవులు


బుట్టాయగూడెం, లింగపాలెం మండలాల్లో శిలువ యాత్ర


పోలవరంలో శిలువతో పాస్టర్, క్రైస్తవులు

మామిడిపండ్లు వచ్చేశాయ్..

» చెరుకు రసాలు పరక రూ.500 వరకు, చిన్నరసాలు రూ.600 వరకు అమ్మకాలు

కాళ్ళ, మార్చి 29 : అందరూ ఇష్టంగా తినే మామిడిపండ్లు ఈ ఏడాది సీజన్ కంటే ముందే వచ్చేశాయ్. సాధారణంగా ఏప్రిల్, మేనెలల్లో పండ్ల సీజన్ మొదలవుతుంది. మార్చిలోనే మామిడి పండ్లు రావడంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కాళ్ళ మండలం సీసలి గ్రామ వద్ద రాష్ట్రీయ రహదారిని ఆనుకుని పండ్ల దుకాణాం వెలిసింది. చెరుకు రసాలు రకం పరక రూ.400 నుంచి రూ.500 వరకు, నూజివీడు చిన్నరసాలు రూ.500 నుంచి రూ.600 వరకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. నూజివీడు తోటల్లోంచి మామిడిపండ్లును దిగుమతి చేసుకున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పుడే మామిడి కాయలు రావడంతో అధిక రేట్ల వెచ్చించి కొనాల్సి వస్తుందని వ్యాపారులు చెబుతున్నారు.



సీసలి వద్ద రోడ్డు పక్కన అమ్ముతున్న వ్యాపారులు

నోరూరించే పుచ్చకాయలు

» పుచ్చకాయ ధర సైజును బట్టి రూ.50 నుంచి 130 వరకు అమ్మకాలు

ముదినేపల్లి, మార్చి 29 : వేసవి కాలం ప్రారంభమైతే మార్కెట్‌లో పుచ్చకాయలు ప్రత్యక్షమవుతాయి. ఈ ఏడాది ముందస్తుగానే ఎండల తీవ్రత పెరగడంతో పుచ్చకాయల అమ్మకాలు పెరిగాయి. ఈ సీజన్‌లో కాయలకు సహజంగానే గిరాకీ పెరగడంతో ధరలు పెరుగుతాయి. ముదినేపల్లి ప్రాంతంలో అధిక సంఖ్యలో పుచ్చకాయలు అమ్మకాలు జరుగుతున్నాయి. జ్యూస్ షాపుల్లో పుచ్చకాయల జ్యూస్ అమ్ముతున్నారు. సైజును బట్టి పుచ్చకాయ ధర రూ.50 నుంచి రూ.130 వరకు అమ్ముతున్నారు.

బహుళ ప్రయోజనకారి..

పుచ్చకాయ బహుళ ప్రయోజనకారి వేసవిలో జనం తినే ముఖ్యమైన కాయల్లో విటమిన్లు అధికంగా ఉంటాయి. శక్తి వంతమైన యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలున్నాయి. పుచ్చకాయలలో 92 శాతం నీరు ఉండడంతో తిన్న వెంటనే శరీరంలో తేమ శాతం పెరుగుతుంది. దాహం తగ్గుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఈ కాయ ప్రయోజనకారి. జీర్ణ వ్యవస్థను బలపరుస్తుంది.



ముదినేపల్లిలో పుచ్చకాయల అమ్మకాలు



హైకోర్టు జడ్జికి స్వాగతం పలుకుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్, అదనపు ఎస్పీ స్వరూపరాణి

ఏలూరు జిల్లాకు హైకోర్టు న్యాయమూర్తి రాక

» నేడు ఉమ్మడి పశ్చిమ జిల్లా న్యాయాధికారులతో సమీక్ష

ఏలూరు క్రైం, మార్చి 29 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. కృష్ణమోహన్ శుక్రవారం సాయంత్రం ఏలూరు జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్‌కు చేరుకున్నారు. ఆయనకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్, అదనపు ఎస్పీ స్వరూపరాణి, ఏలూరు ఆర్డీవో ఖాజావలి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. శనివారం ఏలూరు కలెక్టరేట్ గోదావరి కాన్ఫరెన్సు హాలులో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు. మొదటి అదనపు జిల్లా జడ్జి రామ్‌గోపాల్, ఇతర న్యాయమూర్తులు మర్యాదపూర్వకంగా కలిశారు.

'ఎస్ఆర్‌కేఆర్'లో జీఆర్‌యూ, టోఫెల్ పరీక్ష కేంద్రం

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 29 : ఉన్నత చదువులకై విదేశీ విద్యకు వెళ్లే విద్యార్థుల కోసం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జీఆర్‌యూ, టోఫెల్ కేంద్రాలు ఏర్పాటు చేశామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీ కృష్ణంరాజు తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన జీఆర్‌యూం, టోఫెల్ కేంద్రాన్ని కళాశాల అధ్యక్షుడు సాగి ప్రసాదరాజు చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. కళాశాల సెక్రటరీ ఎస్ఆర్‌కే నిశాంత్‌వర్మ, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ డాక్టర్ బీహెచ్‌వీఎస్ లక్ష్మి మాట్లాడుతూ గత ఏడాది మార్చి 31వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ (ఈటీఎస్) ఇందుకు సంబంధించి ఎంవోయు కూడా చేసుకున్నారన్నారు. గతంలో విద్యార్థులకు విజయవాడ లేదా హైదరాబాద్ వెళ్లి శిక్షణ పొంది అక్కడ పరీక్ష రావాల్సి వచ్చేందన్నారు. తమ కళాశాలలో అధికారికంగా ఇటువంటి సెంటర్‌ను ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులు ఇక్కడే శిక్షణ పొంది పరీక్షలు రాసి వెళ్లే ఆస్కారం ఏర్పడిందన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, గౌరవ ఛైర్మన్ పి.కృష్ణంరాజు, వైస్ ఛైర్మన్ గోకరాజు రామరాజు, ఎస్వీ రంగరాజు, పాలకవర్గ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



టోఫెల్ పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించిన సాగి ప్రసాద్‌రాజు

సికింద్రాబాద్ నుంచి సిల్‌చార్‌కు ప్రత్యేక రైలు

ఏలూరు క్రైం, మార్చి 29 : సికింద్రాబాద్ నుంచి సిల్‌చార్‌కు ప్రత్యేక రైలు నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే శుక్రవారం రాత్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రైలు ఒక వైపు మాత్రమే నడపడం జరుగుతుందని, రైల్ నంబర్ 07050 సికింద్రాబాద్‌లో ఈనెల 31వ తేదీ ఆదివారం సాయంత్రం 4.35 గంటలకు బయలు దేరుతుందని ఏప్రిల్ 3వ తేదీ రాత్రి 11.20 నిమిషాలకు గంటలకు చేరుతుం దన్నారు. ఈ రైలు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ళ, గుంటూరు జంక్షన్, విజయవాడ జంక్షన్, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడ, విజయనగరం జంక్షన్, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బరంపూర్, బలుగన్, కుర్దా రోడ్డు జంక్షన్, భువనేశ్వర్, కటక్, జాజిపూర్ కె.రోడ్డు, భద్రక్, బాల్‌సూర్, కరగ్‌పూర్ జంక్షన్, ధన్‌కుని, బోల్‌పూర్ ఎస్.నిత్తాన్, రామ్‌పూర్, న్యూఫరక్ జంక్షన్, మాల్డా టౌన్, మార్‌సోల్ జంక్షన్, కిషన్‌గంజ్, న్యూజలపాయిగురి, న్యూకోచ్ బీహార్, న్యూ అల్‌పూర్‌దుర్, న్యూ బంగా యిగాన్, రంగియా జంక్షన్, కమక్యాయ, గౌహతి, జాగీరోడ్, హోజాల్, మందిర్ దిషా, న్యూ అప్‌లాంగ్, బాదర్‌పూర్ జంక్షన్‌లలో ఆగుతుందని తెలిపారు. ఈ మార్గాల వెంబడి ప్రయాణించే ప్రయాణికలు ఈ రైల్వే సౌకర్యాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.



దళితవాడలు బాగుపడాలంటే కూటమి గెలవాలి : సాయిబాబు

ఇరగవరం, మార్చి 29 : కూటమి గెలుపుతోనే దళితవాడలు అభివృద్ధి చెందుతాయని మాజీ జడ్పీటీసీ, టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్కా సాయిబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని కె.ఇల్లిందలపర్రు, తూర్పువిప్పర్రు, కె.కుముదవల్లి గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో ఆయన పర్యటించి తణుకు కూటమి అభ్యర్థి రాధాకృష్ణను గెలిపించాలని కోరారు. జగన్ ప్రభుత్వంలో ఎస్సీలకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టించారని, దళితులపై దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చోడే సంజీవరావు, ముప్పిడి నరసింహమూర్తి, బొంత చిట్టిబాబు, చింతపల్లి భాస్కరరావు, సాకా రామాంజనేయులు, కంకిపాటి నాగన్న, దాయం వెంకటరావు, తానేటి సుబ్రహ్మణ్యం, మెరిపే రాజేష్, మురాల కొండయ్య, శాస్త్రి, మట్ట ఆంజనేయులు, టీడీపీ ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

29-03-2024 పొగాకు ధరలు (రూ.) పొగాకు కేంద్రం	గరిష్టం	కనిష్టం	సరాసరి
దేవరపల్లి	241	235	239.54
జంగారెడ్డిగూడెం-1	241	235	239.59
జంగారెడ్డిగూడెం-2	241	235	239.48
కొయ్యలగూడెం	241	235	239.36
గోపాలపురం	245	235	238.72



కోడ్ ఉల్లంఘనలు

» నిఘా పెంచాం : సీఐ సుభాష్

» వాహన తనిఖీలు.. లెక్క చూపని సొమ్ము స్వాధీనం

» గణపవరం మండలంలో ఇప్పటి వరకు రూ.16.62 లక్షల నగదు స్వాధీనం

నగదు, మద్యం రవాణా అడ్డుకునేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేపడుతోంది..ఉమ్మడి పశ్చిమ జిల్లాలో శుక్రవారం పలు ప్రాంతాల్లో ఆధారాలు చూపని నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు.



సరిపల్లి తనిఖీల్లో పట్టుబడిన నగదు చూపుతున్న సీఐ సుభాష్

సరిపల్లిలో రూ.6.14 లక్షల స్వాధీనం

గణపవరం, మార్చి 29: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం, ఇతర వస్తువులు రవాణా చేసే చర్యలకు అడ్డుకట్ట వేసేందుకు నిఘా పెంచామని నిడమర్రు సీఐ ఎంవీ.సుభాశ్ తెలిపారు. శుక్రవారం గణపవరం మండల సరిపల్లి గ్రామ సరిహద్దులో ఎఫ్ఎస్‌టీ టీమ్ ఇన్‌చార్జి సరస్వతి, ఎస్ఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది వాహనాలు తనిఖీ చేశారు. భీమవరంవైపు నుంచి గణపవరం వస్తున్న వాహనాలను ఆపి తనిఖీ చేశారు. ఓ వాహనంలో రూ.1,14,700, మరో వాహనంలో రూ.5 లక్షలు నగదు ఉన్నట్టు గుర్తించి మొత్తం 6 లక్షల 14 వేల 700 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. వీరి వద్ద ఈ నగదుకు సంబంధించి ఎటువంటి రసీదులు, ఆధారాలు లేవని సీఐ తెలిపారు. నిడమర్రు సర్కిల్ పరిధిలో ఇప్పటివరకు రూ.16లక్షల 62,600 నగదు సీజ్ చేశామని, జిల్లా ట్రెజరీకి జమ చేశామన్నారు.

భీమడోలులో రూ.లక్ష స్వాధీనం

భీమడోలు, మార్చి 29 : ఎన్నికల కోడ్ అమలవుతున్న నేపథ్యంలో ఉంగుటూరు నియోజకవర్గంలో అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా భీమడోలులో లక్ష రూపాయల నగదును గుర్తించి స్వాధీనపర్చుకుని నగదును స్ట్రాంగ్ రూమ్‌కు తరలించామని ఏలూరు ఆర్డీవో, ఉంగుటూరు ఆర్వో ఎస్ఎస్‌కే ఖాజావలి తెలిపారు. నగదును తీసుకువెళ్లే సమయంలో సంబంధిత పత్రాలు ఉంచుకోవాలని సూచించారు. రూ.50 వేలు కంటే ఎక్కువ తరలిస్తే ఆ సొమ్మును స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు.

నూజివీడులో రూ.5.30 లక్షలు..



నూజివీడులో నగదుతో సీఐ మూర్తి

నూజివీడు టౌన్, మార్చి 29: నూజివీడులో వాహనంలో తరలిస్తున్న రూ.5.30 లక్షలను నూజివీడు పట్టణ సీఐ మూర్తి స్వాధీనం చేసుకున్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ వద్ద నిర్వహిస్తున్న సాధారణ తనిఖీల్లో ఆధారాలు చూపని నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. విజయ డెయిరీ వాహనంలో ఈ నగదును స్వాధీనం చేసుకోవడం జరిగిందని, ఆధారాలు చూపి నగదును తీసుకువెళ్ళవచ్చని లేనిపక్షంలో ఈ నగదును ఉన్నతాధికారులకు అప్పగించనున్నట్లు ఆయన తెలిపారు.

విస్తృతంగా తనిఖీలు



ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, మార్చి 29 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ గడిచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా 246.43 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ రూ.70,550 అని ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు స్వాధీనం చేసుకున్న నగదు విలువ మొత్తం రూ.13,85,060 అన్నారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా అంతర్‌రాష్ట్ర, అంతర్ జిల్లాల్లో ఎనిమిది చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటికి 31 ఫ్లయింగ్ సర్వేలెన్స్ టీమ్‌లు ఆకస్మికంగా పలు ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నాయన్నారు. కేంద్ర సాయుధ బలగాలతో సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఓటర్లను ఎవరైనా ప్రలోభపెట్టినా, వారికి ఆకంటం కల్గించినా సహించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా మత సంబంధమైన విషయాలపై లేదా ఎదుటి పార్టీ వారిపై విమర్శలు కాని చేయరాదని, ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సూచించారు.

ఇంకా రంగుల్లోనే కార్యాలయం




బోడపాడు పంచాయతీ కార్యాలయం వద్ద ఇనుప స్తంభాలకు వైసీపీ రంగులు

పెంటపాడు, మార్చి 29: ఎన్నికల కోడ్ వచ్చినా రంగులు తొలగింపులో మాత్రం అధికారుల తీరు మారడం లేదు. బోడపాడు పంచాయతీ వద్ద ఉన్న ఇనుప స్తంభాలకు వైసీపీ రంగులు ఇంకా తొలగించలేదు.

ఫ్లయింగ్ స్క్వాడ్ దాడి.. మద్యం స్వాధీనం

» వైసీపీ ప్రచార కార్యక్రమానికి తీసుకువెళ్తున్నట్టు నిందితుడు వెల్లడి



పోలీసులు సీజ్ చేసిన మద్యం సీసాలు

ముసునూరు, మార్చి 29: అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిని గురువారం రాత్రి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి పొలిశెట్టి శ్రీనివాసరావు దాడి చేసి పట్టుకున్నారు. సూరేపల్లి గ్రామానికి చెందిన కొరివి నాగరాజు బైక్‌పై మద్యం సీసాలను రవాణా చేస్తుండగా అక్కిరెడ్డిగూడెం శివారులో దాడిచేసి పట్టుకున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. రూ.6370 విలువగల 49 మద్యం సీసాలు, బైక్‌ను స్వాధీనం చేసుకుని, నిందితుడు నాగరాజును అదుపులోకి తీసుకుని ముసునూరు ఎస్ఐ పి.వాసుకు అప్పగించినట్లు తెలిపారు. నిందితుడిని విచారించగా చెక్కపల్లి ప్రభుత్వ మద్యం దుకాణంలో మద్యాన్ని కొనుగోలు చేసి సూరేపల్లిలో జరిగిన వైసీపీ ప్రచార కార్యక్రమానికి తీసుకువెళ్తున్నట్లు తెలిపాడని ఎస్ఐ తెలిపారు. కోడ్ నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ నాయకులు ప్రచారాలకు, ర్యాలీలకు, ఇతర కార్యకలాపాలకు సైతం మద్యం, నగదు, ఇతర తాయిలాలు అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రైం సమాచారం

160 లీటర్ల సారా స్వాధీనం.. ఒకరి అరెస్టు

పోలవరం, మార్చి 29 : పోలవరం మండలంలో స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో నల్లకాలువ వద్ద పోలీసుల వాహనాల తనిఖీల్లో 160 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. మెత్తప్పకోట గ్రామానికి చెందిన మిడియం రాంబాబు అనే వ్యక్తి మోటారు బైకుపై 160 లీటర్ల సారా రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడని సారా స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేశామని పట్టుబడ్డ వ్యక్తిపై కేసు నమోదు చేసి జంగారెడ్డిగూడెం కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.



పట్టుబడ్డ నాటు సారాతో పోలీసులు

ఏలూరు కిరాణా షాపులో చోరీ

ఏలూరు క్రైం, మార్చి 29 : షాపుకు తాళం వేసి ఇంటికి వెళ్లి మరుసటి రోజు ఉదయం వచ్చేసరికి షాపు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఆ షాపులో నగదు, కిరణా వస్తువులు అపహరణకు గురైనట్టు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు వవర్‌పేటకు చెందిన శంకర్ కిరాణాషాపు నిర్వహిస్తున్నారు. ఈనెల 28వ తేదీ రాత్రి యధావిధిగా షాపునకు తాళాలు వేసి ఆ షాపుపైనే ఆయన కుటుంబంతో నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం వచ్చి చూసేసరికి షాపు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. 45 వేల రూపాయల నగదు, కొన్ని కిరాణా వస్తువులు అపహరణకు గురైనట్టుగా గుర్తించారు. ఈ సంఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టూటౌన్ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

ఏలూరు క్రైం, మార్చి 29:నిబంధనలకు విరుద్ధంగా మద్యాన్ని విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులు ఏలూరు త్రీ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు కొత్తబస్టాండ్ వద్ద పాలగూడెంకు చెందిన చెల్లుబోయిన సత్యనాగరాజు మద్యం విక్రయిస్తున్నట్టు త్రీటౌన్ సీఐ వి వెంకటేశ్వరరావుకు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశారు. అక్కడే ఏలూరు ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఎన్నాడ శుభాష్ అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అతడిని తనిఖీ చేశారు. అతడి వద్ద నాలుగు మద్యం బాటిళ్ల లభించడంతో అతడిని కూడా అరెస్టు చేశారు.

నేడు కొల్లేరు ప్రజలతో ఆత్మీయ సమావేశం

కైకలూరు, మార్చి 29: కైకలూరు నియోజకవర్గంలోని కొల్లేరు ప్రజలతో శనివారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించనున్నట్టు టీడీపీ రాష్ట్ర వడ్డి సాధికార కమిటీ కన్వీనర్ బలే ఏసురాజు తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటలకు కైకలూరు సీఎస్నార్ గార్డెన్ కల్యాణ మండపంలో కైకలూరు, మండవల్లి మండలాల్లోని కొల్లేరు గ్రామాల ప్రజలతో సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఆయా గ్రామస్థులు సమావేశానికి పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు

నూజివీడు టౌన్, మార్చి 29: బొబ్బిలి కొండలరావు స్మారక ఆల్ ఇండియా ఇన్విటేషన్ బాస్కెట్ బాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. లీగ్ కమ్ నాకౌట్ విధానంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో శుక్రవారం తొలుత ఇండియన్ నేవీ, జైన్ వర్సిటీ జట్లు తలపడ్డాయి. 54-66 స్కోరుతో జైన్ వర్సిటీపై ఇండియన్ నేవీ జట్టు విజయం సాధించగా, అనంతరం నిర్వహించిన మ్యాచ్‌లో ఇండియన్ ఆర్మీ, ఏపీ జట్లు తలపడ్డాయి. ఏపీపై 34-78 స్కోరుతో ఇండియన్ ఆర్మీ విజయం సాధించింది. ఇండియన్ బ్యాంక్-ఆంధ్రప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్‌పై ఇండియన్‌బ్యాంక్ 52-93 స్కోరుతో విజయం సాధించింది.

సైన్స్ ఫెయిర్‌లో దీక్షిత ప్రతిభ

ఆగిరిపల్లి, మార్చి 29: శోభనాపురంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న దీక్షిత సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్‌ఫెయిర్‌లో సులభ పద్ధతిలో శానిటరీ నాప్‌కిన్స్ తయారీపై వివరించినందుకు జిల్లా వ్యాప్తంగా రెండో బహుమతి లభించింది. ఆగిరిపల్లి ఎంఈవోలు కె.సర్వేశ్వరరావు, కె.ఆనంద్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాపారావు, దీక్షితను, సైన్స్ ఉపాధ్యాయిని ఘంటా సుధారాణిని అభినందించారు.

కులదూషణపై డీఎస్పీ విచారణ

ముదినేపల్లి రూరల్, మార్చి 29: మండలంలోని వైవాక గ్రామానికి చెందిన కూరపాటి వెంకటేశ్వరరావు, అతని అనుచరులు తనను కులం పేరుతో దూషించారని, అదే గ్రామానికి చెందిన పెయ్యల పౌలు ఈనెల 20న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదైంది. ఇందులో భాగంగా ఏలూరు డీఎస్పీ ఇ. శ్రీనివాసులు వైవాక గ్రామంలో శుక్రవారం స్థానికులను విచారించి నివేదిక తయారు చేశారు. డీఎస్పీ వెంట ఎస్సై కె.వెంకట కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కోటపాడులో ఘనంగా గ్రామోత్సవం

చాట్రాయి, మార్చి 29: కోటపాడులో నూతనంగా నిర్మించిన రామాలయంలో శనివారం ఉదయం 8.10 గంటలకు స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ జరుగనున్న నేపథ్యంలో శుక్రవారం సీతారాములు తదితర దేవతా విగ్రహాలను మంగళవాయిద్యాలతో కన్నుల పండువగా ఊరేగించారు. మహిళలు బిందెలతో జలాలను తీసుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం మహా శాంతి హోమం, కుంభపూజ, పంచశయ్యాధివాసం, చతుర్వేదపారాయణం, మంగళహారతి, నీరాజన మంత్ర పుష్పం, ప్రసాద వితరణ జరిగింది.

స్వాగతం బోర్డుకు మూత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



స్వాగతం బోర్డును కప్పి వేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 29: తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేట లోని కోరుమామిడి రోడ్డులో ఏర్పాటుచేసిన స్వాగతం బోర్డును అధికారులు శుక్రవారం కప్పి వేశారు. ఎన్నికల కోడ్ నిబంధనల్లో భాగంగా బోర్డుపై నాయకుల చిత్రాలు ఉన్నాయని 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం కథనం ప్రచురితమవడంతో అధికారులు స్పందించి బోర్డుపై బరకం వేసి కప్పి వేశారు.

దాడి ఘటనపై మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విచారణ



బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న వెంకటలక్ష్మి

ఏలూరు రూరల్, మార్చి 29: స్థానిక 27వ డివిజన్‌లో ఉన్న శ్రీలక్ష్మి శ్రీనివా సా పద్మావతి అమ్మవారి ఆలయ కార్యదర్శి అచ్యుతకుమారిపై మాజీ కార్యదర్శి రెడ్డినాగరాజు తీవ్రంగా దాడిచేసి గాయపరిచాడని, ఆమె ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొం దుతూ ఘటనపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం బాధితురాలు నివాసం ఉంటున్న కంద్రికగూడెంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ గజ్జెల వెంకటలక్ష్మి తదితరులు వెళ్లి పరామర్శించారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ మహిళను గాయపర్చటం దారుణమని, వృద్ధురాలైన ఆమెపై దాడిచేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి సూచించామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్లు

ప్రతీ విషయానికి రాజకీయ రంగు

» టీడీపీ కార్పొరేటర్లు హేమసుందరి, అరుణ ఆగ్రహం

ఏలూరుటూటౌన్, మార్చి 29: ఓటమి భయంతో వైసీపీ నేతలు ఎన్నికల సమయంలో ప్రతీ విషయానికి రాజకీయ రంగు పులుముతున్నారని టీడీపీ కార్పొరేటర్లు భీమవరపు హేమసుందరి, తంగిరాల అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. బడేటి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తంగెళ్ళమూడి దేవాలయంలో ఇటీవల జరిగిన చిన్నపాటి ఘర్షణ తెలుగుదేశం పార్టీ నాయకులపై రుద్దటాన్ని ఖండిస్తున్నామన్నారు. 27వ డివిజన్‌లో వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కమిటీ సమావేశం జరిగింది. ఆలయ ధర్మకర్తకు అచ్యుతకుమారికి మెంబరు రెడ్డినాగరాజులకు స్వల్ప ఘర్షణ జరిగింది. ఈ తోపులాటలో ఆలయ ధర్మకర్తకు చిన్నపాటి గాయమైంది. దాన్ని టీడీపీ కార్యకర్తలపై రుద్దుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పోణంగిలో వైసీపీ నేత గేదెల సూర్యప్రకాశ్‌ను అదే గ్రామానికి చెందిన గంటా అరుణ అనే మహిళా స్థలాన్ని కబ్జా చేశారని దాంతో మనస్తాపానికి గురైన అరుణ ఆత్మహత్య చేసుకుందన్నారు. బొల్లాయిగూడెంలో చిన్నారిపై వలంటీర్ మానభంగం చేశాడని అన్నారు. ఆ సమయంలో మహిళా కమిషన్ ఎక్కడుందని ప్రశ్నించారు. వైసీపీ నాయకుల దారుణాలు మహిళా కమిషన్‌కు పట్టవా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పృధ్వీశారధ, నగర అధ్యక్షురాలు తవ్వా అరుణకుమారి పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



తాడేపల్లిగూడెం పట్టణం, మండవల్లి మండలం భైరవపట్నంలో పోలీసుల కవాతు దృశ్యాలు

తాడేపల్లిగూడెం రూరల్/మండవల్లి, మార్చి 29: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో పోలీసులు, సాయుధ బలగాలు శుక్రవారం కవాతు నిర్వహించాయి. తాడేపల్లిగూడెం పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణం కల్పించడం తమ బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా భరోసా కల్పించాలనే పట్టణ, గ్రామాల్లో కవాతులు నిర్వహిస్తున్నామన్నారు. ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. మండవల్లి మండలంలో సమస్యాత్మక గ్రామాలైన ఉనికిలి, పెరికేగూడెం, భైరవపట్నం గ్రామాల్లో శుక్రవారం పోలీసు కవాతు నిర్వహించారు. ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు, కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, మండవల్లి ఎస్ఐ రామచంద్రరావు, సిబ్బంది సీఐఎస్ఎఫ్ వారితో కలిసి గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు.


నూజివీడులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకుల నివాళి


గుడిపాడులో టీడీపీ ఆవిర్భావ వేడుకల్లో ఆ పార్టీ నాయకులు


చాట్రాయిలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


ముదినేపల్లిలో టీడీపీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

పేదల జీవితాల్లో వెలుగు నింపిన ఎన్టీఆర్

టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో వక్తలు ▸ఎన్టీఆర్‌కు ఘన నివాళి

నూజివీడు, మార్చి 29: తెలుగువాడి ఆత్మగౌరవం నినాదంతో 42 ఏళ్లుగా పేదల పక్షాన నిలిచిన పార్టీ టీడీపీ అని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు పార్టీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారథి, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళుల ర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం అంటే ఏమిటో యావత్ దేశానికి చూపిన నాయకుడు ఎన్టీఆర్ అని ఆ ఒరవడిని కొనసాగిస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకువెళ్ళిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చి తెలుగువారి ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు నూతక్కి వేణుగోపాలరావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, నూజివీడు మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు ముసునూరి రాజా, మల్లిశెట్టి జగదీష్, మాజీ కౌన్సిలర్ వెంకట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు ఎన్టీఆర్ అని టీడీపీ మండల అధ్యక్షుడు దేవినేని ధలరాం అన్నారు. మండల వ్యాప్తంగా టీడీపీ 42వ ఆవిర్భావ వేడుకలను శుక్రవారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ముసునూరులో దేవినేని ధలరాం, గుడిపాడులో పార్టీ గ్రామ అధ్యక్షుడు మందలపు బుజ్జి, పార్టీ సీనియర్ నాయకులు కొల్లి గంగారామ్, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గద్దె రఘుబాబు, చెక్కపల్లిలో టీడీపీ నాయకులు టి. సత్యనారాయణ, కాటేపల్లి శ్రీనివాసరావు, మామిడిశెట్టి గిరిబాబు, కాటేపల్లి పెదబాబు, తుమ్మల జగన్ మోహన్‌రావు, కాటేపల్లి నాగేశ్వరరావు, కంచర్ల వెంకటేశ్వరరావు, గోపవరంలో గ్రామ అధ్యక్షుడు బుజ్జియ్య, ఉపాధ్యక్షుడు పర్వతనేని శ్రీనివాసరావులు, కాట్రేనిపాడులో గ్రామ అధ్యక్షుడు మొక్కపాటి వెంకట రామారావు, నాయకులు బొమ్మగంటి శ్యామలరావు, గద్దల మోహన్‌రావు, రాపర్ల ప్రతాప్, బాలకృష్ణ, బడిపాటి సాంబయ్య తదితరులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. కేక్‌లను కట్‌చేసి, మిఠాయిలు పంచారు. అలాగే లోపూడి, రమణక్కపేట, చింతలవల్లి తదితర గ్రామాల్లో పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు.

చాట్రాయి: తెలుగుదేశం పార్టీని స్థాపించి ఎన్టీఆర్ పేదల జీవితాల్లో వెలుగు తెచ్చారని పార్టీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చాట్రాయి, చనుబండలో టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదవాడికి కూడు, గూడు కల్పించాలనే ఆశయంతో ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమయ్యాయని, తెలుగు ప్రజల ఆత్మ గౌరవానికి ఎన్టీఆర్ ప్రతీక అని కొనియాడారు. మండల నాయకులు నోబుల్‌రెడ్డి, పలగాని దుర్గారావు, బొట్టు లక్ష్మణరావు, కలకొండ బాస్కరరావు, కందుల కృష్ణ, గద్దం కేశవరెడ్డి, అంబటి సత్యనారాయణ, యర్రా హేమంత్, బుచ్చిబాబు, వెల్ది నాగేశ్వరరావు, పరసా శ్రీను వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదినేపల్లి: కూటమి విజయం ప్రతి ఒక్కరి ధ్యేయం కావాలని, నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషి చేసి చరిత్ర సృష్టించాలని కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ అన్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ముదినేపల్లిలో ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, సీనియర్ నాయకులు చలసాని జగన్మోహనరావు, కొత్తూరు విఠల్, పోసిన పాండురంగారావు, కోడూరు శేషుబాబు, పరసా విశ్వేశ్వరరావు, లింగమనేని భాను ప్రసాద్, డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్, అడుసుమిల్లి రామకృష్ణ, దావు నాగరాజు, యర్రా రాంబాబు, పంతగాని సురేష్, బొంగు రవికుమార్ తదిరతులు పాల్గొన్నారు.

కలిదిండి: మట్టగుంటలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం ఘనంగా నిర్వహించాయి. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల సృష్టికర్త, బీసీల అభ్యున్నతికి పాటుపడిన ఎన్టీఆర్ చిరస్మరణీయుడని కొనియాడారు. టీడీపీ నాయకులు కొప్పనాతి వెంకటేశ్వరరావు, బళ్ల రాజు, పరశురాముడు, గోపాలకృష్ణ, పాండురంగారావు, వెంకటేశ్వరరావు, పరశురామయ్య, రంగారావు, రాంబాబు, తిరుమలశెట్టి కృష్ణ, తరగల మోహన్ తదితరులు పాల్గొన్నారు.


వరహాపట్నంలో కామినేనిని కలిసిన అమరావతి రైతులు

అమరావతే రాజధాని : కామినేని

కైకలూరు, మార్చి 29: రానున్న ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధిస్తుందని రాష్ట్రానికి ఏకైక రాజధాని అమరావతి ఉంటుందని కైకలూరు బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వరహాపట్నంలో కామినేని ఇంటి వద్ద అమరావతి రైతులు కలిసి కామినేనికి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించి రాజధాని అమరావతిని అభివృద్ధి చేసి ఆ ప్రాంత రైతుల సంక్షేమానికి కృషి చేయాలని కామినేనిని కోరారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం చిన్నాభిన్నమైందని ఏపీని రాజధాని లేని రాష్ట్రం చేశారన్నారు. అమరావతి రైతుల త్యాగాలు మహోన్నతమైనవని వారికి కూటమి అండగా ఉంటుందని అమరావతి రాజధానిగా ఉండేలా చేస్తామన్నారు. ప్రజలు రాష్ట్రాభివృద్ధికి పాటుపడే వ్యక్తులను గుర్తించి ఓట్లు వేయాలని కోరారు.

మండవల్లి: మండవల్లి షిర్డిసాయిబాబా ధ్యానమందిరంలో శుక్రవారం కైకలూరు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ పూజలు చేశారు. మందిరంలో నూతనంగా నిర్మించిన అన్నప్రసాదాలయాన్ని ప్రారంభించారు. నిర్వాహకుడు గుడివాడ చిట్టిబాబును అభినందించారు.

ముదినేపల్లి ఆర్యవైశ్య సంఘం నేతలు బీజేపీలో చేరిక

ముదినేపల్లి మండలం ఆర్యవైశ్య సంఘం నాయకులు కొల్లిపర సాయి ఫణీంద్ర, కంతేటి రామకృష్ణ, కైకలూరు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం బీజేపీలో చేరారు. కోటప్రోలు కృష్ణ, పైడిపాటి శివశంకర్, నాగలక్ష్మీ, సత్యవోలు భాషంశెట్టి కిషోర్ తదితరులు పాల్గొన్నారు. మండవల్లిలో డాక్టర్ కామినేని శ్రీనివాస్ పలువురు యువకులకు బీజేపీ కండువా కప్పి ఆహ్వానించారు. నాయకులు కేవీఎన్ఎం నాయుడు, బుసనబోయిన శ్రీనివాసరావు, చిట్టిబాబు, తోట లక్ష్మీ, ముళ్లపూడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వేంపాటి సాయి

కైకలూరు, మార్చి 29: కైకలూరు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా వేంపాటి సాయి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత కమిటీ గడువు ముగియడంతో నూతనంగా ఎన్నికలను నిర్వహించారు. ఉపాధ్యక్షురాలిగా బోడావుల ఇందిర, సెక్రటరీగా ఎంఎస్ఎస్ రాజు, జాయింట్ సెక్రటరీగా ఎ. స్వరూప్, ట్రెజరర్‌గా జీవీ జితేంద్ర, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అధికారిగా కె. మురళీపవన్, లైబ్రరీ ప్రతినిధిగా సీహెచ్. జయప్రకాష్, మహిళా ప్రతినిధిగా సుకన్య గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా తుమ్మలపల్లి బాలకృష్ణారావు వ్యవహరించగా గొర్తి ప్రభాకర దీక్షితులు, తెలగంశెట్టి శ్రీనివాసరావు, గురజాడ ఉదయశంకర్, వడ్లాని శ్రీరామచంద్రమూర్తి, మాడపాటి సత్యనారయణ, కారే శరత్ తదితరులు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్‌ల కవాతు

మండవల్లి, మార్చి 29: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన ఉనికిలి, పెరికేగూడెం, భైరవపట్నం గ్రామాల్లో శుక్రవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఏలూరు జిల్లా ఎస్పీ డి. మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు శుక్రవారం ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు, కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, మండవల్లి ఎస్సై రామచంద్రరావు, సిబ్బంది సీఐఎస్ఎఫ్‌తో కలిసి గ్రామంలో కవాతు నిర్వహించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ముసునూరు, మార్చి 29: చెక్కపల్లి శివారులో జరుగుతున్న పేకాట శిబిరంపై శుక్రవారం తెల్లవారుజామున ముసునూరు ఎస్ఐ పి.వాసు తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో ఏ-కొండూరు మండలం కంభంపాడుకు చెందిన బాణవత్ రాంబాబు, చెక్కపల్లికి చెందిన నక్కా రామకృష్ణను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 1110లు నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న పార్థసారథి

టీడీపీతోనే సమస్యల పరిష్కారం

ఆగిరిపల్లి, మార్చి 29: సీతారాంపురంలో గురువారం రాత్రి నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గ్రామంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానని, మీ మనిషిగా ఆదరించి గెలిపించాలని కోరారు. నాయకులు నూతక్కి వేణు, జనసేన నాయకుడు శివరామకృష్ణ, టీడీపీ నాయకులు చిట్నేని శివరామకృష్ణ, పార్టీ గ్రామ అధ్యక్షులు చిన్ని సుబ్బారావు, గోళ్ళరాజు, బెక్కం రాజగోపాల్, దొండపాటి ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో దీక్షిత ప్రతిభ



ఆగిరిపల్లి, మార్చి 29: శోభనాపురంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న దీక్షిత సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్‌ఫెయిర్‌లో సులభ పద్ధతిలో శానిటరీ నాప్‌కిన్స్ తయారీపై వివరించినందుకు జిల్లా వ్యాప్తంగా రెండో బహుమతి లభించింది. ఆగిరిపల్లి ఎంఈవోలు కె.సర్వేశ్వరరావు, కె.ఆనంద్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాపారావు, దీక్షితను, సైన్స్ ఉపాధ్యాయిని ఘంటా సుధారాణిని అభినందించారు.

50 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్ల పంపిణీ

ఆగిరిపల్లి, మార్చి 29: దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపడంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి దాతల సహకారం అవసరమని నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య అన్నారు. తోటపల్లిలో గల కృత్రియ అవయువ కేంద్రంలో హైదరాబాద్‌కు చెందిన పూర్వాన్ష్ హోల్డింగ్ లిమిటెడ్ ఆర్థిక సాయంతో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 50 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్ళు అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. హీల్ సిఈవో కూరపాటి అజయ్‌కుమార్, హీల్ క్యాంపస్ చైర్మన్ పిన్నమనేని ధనప్రకాష్, వ్యాపారవేత్త దండమూడి శ్రీధర్, పూర్వాన్ష్ హోల్డింగ్ ప్రతినిధి స్వప్న, హీల్ కార్యదర్శి శ్రీమతి తాతినేని లక్ష్మి, ప్రిన్సిపల్ సాయిబాబు, టెక్నీషియన్ చిన్న పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమమే కూటమి లక్ష్యం : షరీఫ్



కలిదిండి, మార్చి 29: ముస్లింల సంక్షేమమే కూటమి లక్ష్యమని శాసన మండలి మాజీ చైర్మన్ ఎండీ షరీఫ్ అన్నారు. శుక్రవారం కలిదిండిలో కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ నిర్వహించిన ముస్లిం ఆత్మీయ సమ్మేళన సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ కామినేని స్నేహానికి విలువనిచ్చే మంచి మనిషన్నారు. గతంలో ఫాతిమా కాలేజీ విషయంలో ఢిల్లీకి వెళ్లి లడ్డాతో మాట్లాడి 500 మంది ముస్లిం మెడిసిన్ విద్యార్థులకు న్యాయం చేశారన్నారు. వైసీపీ పాలనలో ముస్లింలకు అనేక సంక్షేమమ పథకాలు తీసివేశారన్నారు. గతంలో చంద్రబాబు ముస్లిం మైనార్టీలకు 3 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. కూటమి అభ్యర్థి కామినేని మాట్లాడుతూ ముస్లిం ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన షరీఫ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కైకలూరు: రంజాన్ ఐక్యతకు నిదర్శనమని బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కైకలూరు చిన్నమసీదులో ముస్లింలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. మాజీ వైస్ ఎంపీపీ ఎండీ రహీం, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ జానీ, టీడీపీ మైనార్టీ నాయకులు ఎండీ ఉస్మాన్, సయ్యద్ బాషీద్, సయ్యద్ జమీల్, మత పెద్దలు, కేవీఎన్ఎం నాయుడు, టీడీపీ నాయకులు పూల రామచంద్రరావు, కేకే బాబు, బీజేపీ నాయకులు పైడిపాటి శివశంకర్, బూరుబోయిన శ్రీనివాసరావు, పేరిచర్ల ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.


లోపూడిలో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

వైసీపీ పాలన అవినీతిమయం

ముసునూరు, మార్చి 29: వైసీపీ ఐదేళ్ళపాలన అవినీతిమయమని టీడీపీ గ్రామ అధ్యక్షుడు వేంపాటి శ్రీనివాసరావు విమర్శించారు. శుక్రవారం లోపూడిలో సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించి, కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంక్షేమం పేరుతో ప్రతిఏటా లబ్ధిదారుల సంఖ్యను తగ్గించి, అర్హులందరికీ పథకాలు ఇచ్చినట్లు రికార్డుల్లో చూపి కోట్లాది రూపాయాల ప్రజాధనాన్ని ఈ ప్రభుత్వం దోచుకుందన్నారు. ఇటీవల పథకాలపై లబ్ధిదారులకు వలంటీర్లు ఇచ్చిన కరపత్రాల్లో ఈ విషయం తేటతెల్లమైందన్నారు. అలాగే ఇళ్ళస్థలాలు, ఇసుక, మట్టి, నూతన భవనాల్లో సైతం వైసీపీ నాయకులు అవినీతికి పాల్పడ్డారని, ప్రజలకు ఈ ప్రభుత్వం ఇచ్చింది పది, దోచుకుంది వంద రూపాయాలని ఆరోపించారు. రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్నా, ప్రజలకు సంక్షేమ పథకాలు, యువతకు ఉపాధి లభించాలంటే కూటమి అభ్యర్థిని గెలిపించుకోవాలని కోరారు. నాయకులు చలమాల వెంకటేశ్వరరావు, నక్కా చెన్నారావు, డోలా రాంబాబు, కాటేపల్లి కేశవరావు, పేరం వెంకటరమణ, పంజుగల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కోటపాడులో ఘనంగా గామోత్సవం



చాట్రాయి, మార్చి 29: కోటపాడులో నూతనంగా నిర్మించిన రామాలయంలో శనివారం ఉదయం 8.10 గంటలకు స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ జరుగనున్న నేపథ్యంలో శుక్రవారం సీతారాములు తదితర దేవతా విగ్రహాలను మంగళవాయిద్యాలతో కన్నుల పండువగా ఊరేగించారు. మహిళలు బిందెలతో జలాలను తీసుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం మహాశాంతి హోమం, కుంభపూజ, పంచశయ్యాధివాసం, సర్వదేవార్చన, చతుర్వేదపారాయణం, మంగళహారతి, నీరాజన మంత్ర పుష్పం, ప్రసాద వితరణ జరిగింది.

స్వచ్ఛందంగా ఊటబావి అభివృద్ధి



కైకలూరు, మార్చి 29: కైకలూరు లో మంచినీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చడంతో ప్రజలు తాగేందుకు, కనీస అవసరాలకు నీరు దొరక్క పోవడంతో ప్రజలు స్వచ్ఛందంగా ఊటబావులను బాగుచేసుకుం టున్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో శుక్రవారం కైకలూరు పెద్దమసీదు వెనక ఉన్న బావిని స్వచ్ఛందంగానే బాగు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యా మ్నాయ ఏర్పాట్లు చేయడంలోనూ అధికారులు విఫలమయ్యారని ఆ ప్రాంత ప్రజలు వడ్లమన్నాటి రామకృష్ణ, మారూతి ప్రసాద్, నాగరాజు తదితరులు ఆరోపించారు.

నిస్వార్థ సేవలను గుర్తించాలి : ముద్దరబోయిన

చాట్రాయి, మార్చి 29: పదేళ్ళ పాటు తాను నూజివీడు నూజివీడు నియోజకవర్గంలో అందించిన నిస్వార్థ సేవలను ప్రజలు గుర్తించి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయన వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని చిత్తపూరులో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు.

వైవాకలో డీఎస్పీ విచారణ

ముదినేపల్లి రూరల్, మార్చి 29: వైవాక గ్రామానికి చెందిన కూరపాటి వెంకటేశ్వరరావు, అతని అనుచరులు తనను కులం పేరుతో దూషించారని, అదే గ్రామానికి చెందిన పెయ్యల పౌలు ఈ నెల 20న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదైంది. ఇందులో భాగంగా ఏలూరు డీఎస్పీ ఇ. శ్రీనివాసులు వైవాక గ్రామంలో శుక్రవారం స్థానికులను విచారించి నివేదిక తయారు చేశారు. డీఎస్పీ వెంట ఎస్సై కె.వెంకట కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.5.30 లక్షలు స్వాధీనం



నూజివీడు టౌన్, మార్చి 29: నూజివీడులో వాహనంలో తరలిస్తున్న రూ.5.30 లక్షలను నూజివీడు పట్టణ సీఐ మూర్తి స్వాధీనం చేసుకున్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ వద్ద నిర్వహిస్తున్న సాధారణ తనిఖీల్లో ఆధారాలు చూపని నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. విజయ డెయిరీ వాహనంలో ఈ నగదును స్వాధీనం చేసుకోవడం జరిగిందని, ఆధారాలు చూపి నగదును తీసుకువెళ్ళవచ్చని లేనిపక్షంలో ఈ నగదును ఉన్నతాధికారులకు అప్పగించనున్నట్లు ఆయన తెలిపారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ దాడి.. మద్యం స్వాధీనం

▸వైసీపీ ప్రచార కార్యక్రమానికి తీసుకువెళ్తున్నానన్న నిందితుడు



ముసునూరు, మార్చి 29: అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిని గురువారం రాత్రి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి పొలిశెట్టి శ్రీనివాసరావు దాడి చేసి పట్టుకున్నారు. సూరేపల్లి గ్రామానికి చెందిన కొరివి నాగరాజు బైక్‌పై మద్యం సీసాలను రవాణా చేస్తుండగా అక్కిరెడ్డిగూడెం శివారులో దాడిచేసి పట్టుకున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. రూ.6370 విలువగల 49 మద్యం సీసా లు, బైక్‌ను స్వాధీనం చేసుకుని, నిందితుడు నాగరాజును అదుపులోకి తీసుకుని ముసునూరు ఎస్ఐ పి.వాసుకు అప్పగించినట్లు తెలిపారు. నిందితుడిని విచారించగా చెక్కపల్లి ప్రభుత్వ మద్యం దుకాణంలో మద్యాన్ని కొనుగోలు చేసి, సూరేపల్లిలో జరిగిన వైసీపీ ప్రచార కార్యక్రమానికి తీసుకువెళ్ళుతున్నట్లు తెలిపాడని ఎస్ఐ తెలిపారు. కోడ్‌కు విరుద్ధంగా రాజకీయ నాయకులు ప్రచారా లకు, ర్యాలీలకు, ఇతర కార్యకలాపాలకు సైతం మద్యం, నగదు, ఇతర తాయి లాలు అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు

నూజివీడు టౌన్, మార్చి 29: బొబ్బిలి కొండలరావు స్మారక ఆల్ ఇండియా ఇన్విటేషన్ బాస్కెట్ బాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. లీగ్ కమ్ నాకౌట్ విధానంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో శుక్రవారం తొలుత ఇండియన్ నేవీ, జైన్ వర్సిటీ జట్లు తలపడ్డాయి. 54-66 స్కోరుతో జైన్ వర్సిటీపై ఇండియన్ నేవీ జట్టు విజయం సాధించగా, అనంతరం నిర్వహించిన మ్యాచ్‌లో ఇండియన్ ఆర్మీ, ఏపీ జట్లు తలపడ్డాయి. ఏపీ పై 34-78 స్కోరుతో ఇండియన్ ఆర్మీ విజయం సాధించింది. ఇండియన్ బ్యాంక్-ఆంధ్రప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్‌పై ఇండియన్‌బ్యాంక్ 52-93 స్కోరుతో విజయం సాధించింది.

టీడీపీ నాయకుడు జగన్మోహనరావు మృతి


కొడాలి జగన్మోహన్‌రావు (ఫైల్)

నూజివీడు టౌన్, మార్చి 29: టీడీపీ సీనియర్ నాయకుడు, తుక్కులూరు మాజీ సర్పంచ్ కొడాలి జగన్మోహన్‌రావు (85) శుక్రవారం మృతి చెందారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం తుదిశ్వాస విడిచారు. పార్టీ ఆవిర్భావం నుంచి చురుకైన వ్యక్తిగా ఉన్న ఆయన తుక్కులూరు సర్పంచ్‌గా, తుక్కులూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా, తెలుగు రైతు విభాగంలో వివిధ హోదాలో పనిచేశారు. ఈయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కొడాలి జగన్మోహన్ రావు భౌతికకాయాన్ని నూజివీడు కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, నూజివీడు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు నూతక్కి వేణుగోపాలరావు, మండల టీడీపీ అధ్యక్షులు ముసునూరి రాజా, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షులు జగ్గవరపు వెంకటరెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

నేడు కొల్లేరు ప్రజలతో ఆత్మీయ సమావేశం

కైకలూరు, మార్చి 29: కైకలూరు నియోజకవర్గంలోని కొల్లేరు ప్రజలతో శనివారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు టీడీపీ రాష్ట్ర వడ్డి సాధికార కమిటీ కన్వీనర్ బలే ఏసురాజు తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటలకు కైకలూరు సీఎన్నార్ గార్డెన్ కల్యాణ మండపంలో కైకలూరు, మండవల్లి మండలాల్లోని కొల్లేరు గ్రామాల ప్రజలతో సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఆయా గ్రామస్థులు సమావేశానికి పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.


కైకలూరులో శిలువ మోస్తున్న బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని



కలిదిండిలో శిలువ యాత్ర.. ఆగిరిపల్లిలో బ్రదర్ చినబాబు ప్రసంగం


నూజివీడులో శిలువ యాత్ర


చనుబండలో రహదారిపై క్రైస్తవుల సామూహిక ప్రార్థనలు

క్రీస్తు బోధనలు అనుసరణీయం

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే.. చర్చిల్లో ప్రార్థనలు.. శిలువతో ర్యాలీలు

నూజివీడు టౌన్, మార్చి 29: గుడ్ ఫ్రైడేని నూజివీడు పట్టణం, మండలంలో విశ్వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌సీఎం, సీఎస్ఐ, ఐసీఎం, పెంతికోస్తు, ఎస్‌డీఏ, బెతస్థ తదితర చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం నెహ్రూపేట ఆర్‌సీఎం చర్చి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ గొర్రుముచ్చు జోసఫ్ ఆధ్వర్యంలో నూజివీడు పట్టణంలో సిలువయాత్ర నిర్వహించారు. మత కన్యలు, సంఘపెద్దలు, క్రైస్తవ విశ్వాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ముసునూరు: సర్వమానవాళి పాపాలను హరించేందుకు ఏసుక్రీస్తు శిలువపై రక్తాన్ని చిందించాడని, ఆయన త్యాగనిరతి ఆదర్శనీయమని ఫాదర్ జోసఫ్ తంబి అన్నారు. ముసునూరు ఆర్‌సీఎం చర్చి సంఘస్తులు, దీక్షాపరులు, విచారణ గురువులు సంయుక్తంగా పురవీధుల్లో సిలువ మార్గాన్ని నిర్వహించారు. ప్రధాన కూడళ్ళలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు చూపిన ప్రేమ, కరుణ, క్షమ, త్యాగ మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని విచారణ గురువులు ఉద్బోధించారు. సహాయక గురువులు గాంధీ రాజ, వాక్యో పదేశకులు దేవరపల్లి బెనర్జీ, చీలి స్వామిదాసు, ముళ్ళపూడి వెంకటేశ్వరరావు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలో గుడ్ ఫ్రైడేని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చాట్రాయి, చనుబండ, కోటపాడు గ్రామాల్లో ఆర్సీఎం చర్చిల ఆధ్వర్యంలో సిలువ మార్గం నిర్వహించారు. ఏసుక్రీస్తు శిలువ మోయడం, ఆయనను శిలువ వేసిన దృశ్యాలను ప్రదర్శించారు. విశ్వాసులు భక్తి గీతాలు ఆలపిస్తూ ఊరేగింపులో పాల్గొనగా, అన్ని చర్చిలలో సామూహిక ప్రార్థనలు జరిగాయి.

ఆగిరిపల్లి: తనను శిలువ వేసిన తరువాత మానవాళి కోసం ఏడు మాటలు మాట్లాడిన రోజే గుడ్ ఫ్రైడే అని ఆగిరిపల్లి గాడ్ ఆఫ్ గాడ్ చర్చి మినిస్ట్రీస్ పాస్టర్ కె.చినబాబు అన్నారు. ఆగిరిపల్లి ఎస్ఎఫ్ఎస్ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. పవిత్ర శుక్రవారం అనేది ముఖ్యంగా మూడు భాగాలని మొదటిది జన్మ, రెండోది సిలువలో మరణం, మూడోది ఉత్థానమని ప్రజల్లో క్రీస్తుపై విశ్వాసం మొదలైంది పునరుజ్జీవనంతోనే అని ఫాదర్ అల్లం ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ గుడ్‌ఫ్రైడే క్రీస్తుపాలనలో ఎలా జరిగిందో క్రీస్తుపై ఎలా సిలువ మోపి హింసించారో ఆ కథారూపాన్ని పాత్రల ద్వారా ప్రజలకు అర్థమయ్యే రీతిలో ర్యాలీ నిర్వహిస్తూ ఎస్ఎఫ్ఎస్ చర్చికి వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేసినట్టు వివరించారు.

కైకలూరు నియోజకవర్గంలో...

కైకలూరు, మార్చి 29: ఏసుప్రభువు చూపిన శాంతిమార్గంలో ప్రజలంతా నడుచుకోవాలని కైకలూరు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కైకలూరు ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించగా బీజేపీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్ శిలువ మోస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. మండలంలోని అన్ని చర్చిల్లో ఏసు బోధనలను ఆయా చర్చి ఫాదర్లు వివరించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ శిలువపై ఏసుక్రీస్తు ప్రాణాలు విడిచిన రోజును గుర్తు చేసుకుంటూ క్రైస్తవులంతా ఈ ప్రార్థనలు నిర్వహించడం క్రీస్తు విలువను తెలియజేసే విధంగా ఉందన్నారు. అలాగే 45 రోజులుగా సువార్తీకులు ఉపవాస దీక్షలు నిర్వహించారు. బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మండవల్లి: మండవల్లి ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. మండవల్లి నుంచి భైరవపట్నం వరకు శిలువ యాత్రను భక్తి గీతాలతో భారీ సంఖ్యలో క్రైస్తవులు నిర్వహించారు. మాజీ మంత్రి, కైకలూరు బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ మండవల్లిలో గుడ్ ఫ్రైడే వేడుకల్లో పాల్గొని గుడ్‌ఫ్రైడే ప్రాముఖ్యతను వివరించారు. ఆర్సీఎం చర్చి ఫాదర్ కిరణ్, పలువురు మత బోధకులు, మండవల్లి సర్పంచ్ మెండా ఝాన్సీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండి ఆర్‌సీఎం చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు శిలువతో ర్యాలీ నిర్వహించారు. మానవాళి రక్షణకు ఏసు ప్రభువు తన ప్రాణాన్ని అర్పించిన రోజే గుడ్ ఫ్రైడే అని దైవసేవకులు తెలిపారు. అన్నదానం జరిగింది. మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే డీఎన్నార్, ఫాదర్లు బంటుమిల్లి యోహాను, ఏసురాజు పాల్గొన్నారు. అలాగే భాస్కరరావుపేట, గుర్వాయిపాలెం గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు జరిగాయి. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సిలువతో ర్యాలీ నిర్వహించారు.

ముదినేపల్లి: మండలంలో గుడ్ ఫ్రైడే క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. శిలువను ఊరేగించి ఏసు బోధనలను ఆలపించారు. ముదినేపల్లిలోని ఆర్‌సీఎం చర్చి ఫాదర్ మరియన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పలు గ్రామాలకు చెందిన వందలాది మంది క్రైస్తవులు పాల్గొన్నారు. మండలంలోని పెయ్యేరు, పెదగొన్నూరు, విశ్వనాద్రిపాలెం, కొరగుంటపాలెం, జానకిగూడెం, చేవూరు, కాకరవాడ, అల్లూరు తదితర గ్రామాల్లో పాస్టర్లు కటికల ప్రభుదాసు, గోళ్ల రాజ్ కుమార్ తదితరుల ఆధ్వర్యంలో సిలువ ఊరేగింపు జరిగింది. టీడీపీ నాయకుడు కొడాలి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: వాడవాడలా శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. లోక రక్షకుడు అయిన ప్రభు అందర్ని చల్లగా చూడాలని ప్రార్థించారు. చిగురుకోటలో నిర్వహించిన వేడుకల్లో టీడీపీ నాయకుడు కొడాలి వినోద్ పాల్గొన్నారు.